

నల్లబ్యాడ్జీలతో విధులు

నందలూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వైద్యాధికారులు చేస్తున్న రాష్ట్రవ్యాప్త సమ్మెకు మద్దతుగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మొత్తం నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ బుధవారం విధులకు హాజరయ్యారు. వైద్యాధికారుల డిమాండ్‌లు నెరవేరేవరకు ఇలాగే విధులు కొనసాగిస్తామని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన ర్యాలీ



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న టూరిజం శాఖాధికారి నాగభూషణం

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణల లబ్ధిని ప్రజలకు విస్తృతంగా తెలియజేయడం కోసం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరిట వికాస్ విశ్వాస్-నమ్మకమైన అభివృద్ధి పేరుతో జిల్లాలోని పలు పర్యాటక ప్రాంతాల్లో జిల్లా యంత్రాంగం అవగాహనా కార్యక్రమాలను పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు టూరిజం శాఖాధికారి నాగభూషణం తెలిపారు. బుధవారం రాయచోటిలోని బంగ్లా సర్కిల్ వద్ద అవగాహన ర్యాలీ చేపట్టినట్లు తెలియజేశారు. నెల రోజుల పాటు సమగ్ర అవగాహన కార్యక్రమాలను పర్యాటక ప్రాంతాలైన హార్సిలీహిల్స్, నందలూరు సౌమ్యనాథస్వామి ఆలయం, పింఛా జలాశయం దగ్గర జీఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలు, ధరల తగ్గింపు, వినియోగదారులకు కలిగే ఆదా గురించి ప్రజలకు అర్థమయ్యేలా ఫ్లాష్ మాబ్స్, ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు. అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రచార కార్యక్రమాలు ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ఏర్పాటు చేసి తగ్గిన ధరల గురించి ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ జీఎస్టీ, జిల్లా విద్యాశాధికారి, పీడీ డ్వామా, లీడ్ బ్యాంక్ మేనేజర్, డీఐఈవో, సచివాలయ సిబ్బంది, డైట్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది, రాజు జూనియర్ కళాశాల విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌షెడ్ పనుల్లో

సుండుపల్లెకు మూడో స్థానం



వాటర్‌షెడ్‌ను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం, అధికారులు

సుండుపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ పనుల్లో రాష్ట్రంలో సుండుపల్లెకు మూడవ స్థానం వచ్చినట్టు డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. బుధవారం పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషన్ ఆధ్వర్యంలో మండలంలో జరిగిన వాటర్ షెడ్ పనుల ఫొటోలను చిత్రీకరించేందుకు విజయవాడ నుంచి సంబంధిత అధికారులు వచ్చారు. పీడీతో కలిసి వారు పనులను పరిశీలించారు. రాష్ట్రంలో 7 మండలాలను ఉత్తమ పనులు జరిగిన మండలాలుగా గుర్తించామని, అందులో సుండుపల్లె మండలానికి 3వ స్థానం రావడం చాలా గొప్ప విషయమన్నారు. సుండుపల్లె మండలానికి రూ.20 లక్షల అదనపు పనులను ప్రభుత్వం కల్పించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖల అధికారులను అభినందించారు. జరిగిన పనుల ఫొటోలు, వీడియోలు తీసి రాష్ట్ర అధికారులకు అందచేస్తామని తెలిపారు.

నిలువు దోపిడీ...!



- ఇష్టారాజ్యంగా బాణాసంచా ధరలు..
- పన్ను చెల్లింపులోనూ టోకరా
- ప్రభుత్వాదాయానికి భారీగా గండి
- ఓ దుకాణదారు కనుసన్నల్లో ఐదు శాఖల అధికారులు

> మారుతున్న కాలానికి తగ్గట్టు మనిషి జీవితంలో టపాకాయల ప్రాధాన్యత పెరిగిపోయింది. పుట్టుక నుంచి చావు వరకు.. పెళ్లి నుంచి సంబరాల వరకు.. తిరుణాల నుంచి రాజకీయ నాయకుల ఊరేగింపుల వరకు.. ఇవి కాలందే.. పేలందే.. జరగడం లేదు. ప్రజల బలహీనత బాణాసంచా వ్యాపారులకు వరంలా మారింది. తమకు ఇష్టమొచ్చినంత ధరలు పెట్టి జలగల్లా సామాన్య ప్రజల రక్తాన్ని పీలుస్తున్నా అడిగేవాళ్లే లేరు.



సాయిగణేశ్ టపాకాయల దుకాణం

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండల కేంద్రం జాతీయ రహదారిపైనే ఉన్న సాయి గణేశ్ ట్రేడర్స్ టపాకాయల దుకాణం రాయలసీమ స్థాయిలో ముఖ్యమైనది. ఇక్కడి నుంచి ప్రతి సంవత్సరం దాదాపు రాయలసీమ జిల్లాలు అన్నింటికీ టపాకాయలు సరఫరా అవుతాయి. స్థానికంగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వాళ్లు ఇక్కడి నుంచే హోల్‌సేల్ ధరలకు టపాకాయలు కొని అక్కడ అమ్ముకుంటారు. దీంతో దుకాణం సంవత్సరం పొడవునా కొనుగోలుదార్లతో కిటకిటలాడుతుంటుంది. ఈ దుకాణదారుడు ప్రజలను నిలువు దోపిడీ చేసిన సొమ్ములోనూ.. ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నుల్లో టోకరా వేస్తున్నాడని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రధానమైన ఐదు శాఖలు ఈ దుకాణదారుడి కనుసన్నల్లో ఉన్నాయని అందుకే ఆ దుకాణంలో జరుగుతున్న దోపిడీ గురించి ఎన్ని ఫిర్యాదులు వచ్చినా.. పత్రికల్లో వచ్చినా ఎవరూ ఆ దుకాణం వైపు కనీసం కన్నెత్తి కూడా చూడరని పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.

అనుమతి గోరంత.. అమ్మేది కొండంత?

కడప-బెంగళూరు ప్రధాన రహదారి మీద ఈ దుకాణాన్ని ప్రజల ప్రాణాలకు ప్రమాదకరంగా ఉన్నప్పటికీ నిర్వహిస్తున్నారు. దుకాణదారుడికి ప్రభుత్వం ఇచ్చిన అనుమతుల ప్రకారం ఈ దుకాణం నివాస గృహాలకు 150 మీటర్ల దూరంలో ఉండి 100 కిలోల టపాకాయలు నిల్వ చేసుకుని.. 500 కిలోల చైనీస్ టపాకాయలు అమ్ముకోవాలి. అయితే ప్రస్తుతం ఈ దుకాణం ప్రధాన రహదారి పైనే ఉంది. నిత్యం వందలాది వాహనాలు అక్కడి నుంచి వెళుతుంటాయి. ఈ దుకాణం సమీపంలో పలు దుకాణాలు ఉన్నాయి. ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం వాటిల్లే ప్రమాదముంది. అనుమతులతో సంబంధం లేకుండా లారీలకు లారీలు ఈ దుకాణం సమీపంలోనే శివకాశి నుంచి టపాకాయలు తెచ్చి అమ్ముతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు.

ఆకాశంలో ధరలు

టపాకాయల ధరలు ఆకాశంలో ఉంటాయని పేదలు వాపోతున్నారు. టపాకాయల బాక్సులపైన వేల రూపాయలు ఎంఆర్‌పీ ఉంటున్నాయి. ఈ మేరకు ధరలు నిర్ణయించవచ్చా.? దీనివల్ల సామాన్య ప్రజల నెత్తిన భరించలేని భారం పడుతుందా? అని ఎవరూ ఆలోచించలేదు. ప్రజల బలహీనతపైన జరుగుతున్న ఈ వ్యాపారం గురించి సంబంధిత శాఖ పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. దుకాణంలో ఎటువంటి పరిస్థితుల్లోనూ గుంపులుగా జనం ఉండకూడదు. విశాల ప్రదేశంలో ఏర్పాటు చేయాలి. అనుకోని ప్రమాదం జరిగినా.. పెద్దగా ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా తగినన్ని ఏర్పాట్లు చేయాలి. అయినా ఇవేమీ ఆ దుకాణంలో పాటించడం లేదు.

జిల్లా అంతటా ఇదే పరిస్థితి

ఈ దోపిడీ కేవలం ఈ దుకాణం ఒక దానికే పరిమితం కాలేదు. రాజంపేటలో కడప- తిరుపతి ప్రధాన రహదారిపైనే టపాకాయల దుకాణం ఉంది. అయినా దీనిని ఏ శాఖ పట్టించుకోవడం లేదు. ధరల విషయంలో మదనపల్లె, పీలేరు, రైల్వేకోడూరు, రాయచోటి, చిన్నమండెం, వీరబల్లిలతో ఉన్న అన్ని దుకాణాల్లోనూ దోపిడీ జరుగుతోందనే చెప్పవచ్చు. ఇకనైనా సంబంధిత శాఖలు స్పందించి నిబంధనలు ఉల్లంఘించిన దుకాణాల లైసెన్సులు రద్దు చేయడంతో పాటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ప్రభుత్వాదాయానికి భారీగా గండి

> సంవత్సరానికి కోట్ల రూపాయల టర్నోవర్ జరుగుతున్నా ఆ మేరకు ప్రభుత్వానికి పన్నులు చెల్లించడం లేదు. సాధారణంగా ఈ దుకాణంలో ఎవరు టపాకాయలు కొన్నా దుకాణం లైసెన్స్, టిన్ నెంబరు ఉన్న స్లిప్పు మీద ఇన్‌వాయిస్ బిల్లులు ఇవ్వాలి. అయితే కేవలం తెల్ల కాగితం మీద బిల్లులు రాసి పంపుతున్నారు. ఈ దుకాణంలో ఏటా కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతున్నా నామమాత్రంగా పన్నులు చెల్లిస్తున్నారు. ఇంతపెద్ద ఎత్తున ప్రభుత్వాదాయానికి నష్టం వాటిల్లుతున్నా.. ఎవరూ ఆ దుకాణంపైపు కూడా చూడడం లేదు.

కొసమెరుపు: ఎవరైనా కొనుగోలుదారుడు ఐదు శాఖలను తన గుప్పిట్లో ఉంచుకున్న దుకాణదారుడితో మీరు ధరలు ఎక్కువగా చెబుతున్నారు.. బిల్లులు తెల్లపేపర్ మీద ఇస్తున్నారు.. అధికారులకు ఫిర్యాదు చేస్తామని చెబితే వెంటనే ఆ దుకాణదారుడు.. తన ఫోన్ ఇచ్చి.. నీవు ఎవరికి ఫోన్ చేసుకుంటావో? చేసుకో.. అని దబాయిస్తాడని పలువురు పేర్కొంటున్నారు.

50 ఎకరాల్లో టిడ్కో ఇళ్లు

- శిబ్యాల పరిధిలోని భూమి అప్పగింతకు ఆదేశాలు
- ఎన్టీఆర్ నగర్ పేరుతో ఇళ్ల సముదాయం

7

పీలేరులో ప్రైవేటు ఆసుపత్రి సీజ్

కస్టడీకి 10 మంది నిందితులు

- నకిలీ మద్యం కేసులో కీలక పరిణామం
- రేపు ములకలచెరువుకు తీసుకురానున్న ఎక్సైజ్ పోలీసులు



ములకలచెరువు ఎక్సైజ్ స్టేషన్

ములకలచెరువు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో మదనపల్లె సబ్‌జైలులో ఉన్న 10 మంది నిందితులను కస్టడీకి ఇస్తూ తంబళ్లపల్లె జడ్జి ఉమర్ ఫరూక్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. 10 మంది నిందితులను కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ అధికారులు దాఖలు చేసిన కస్టడీ పిటీషన్‌పై బుధవారం విచారణ జరిగింది. ఇరుపక్షాల న్యాయవాదుల వాదనలు విన్న జడ్జి తొమ్మిది మంది నిందితులకు రెండు రోజులు, ఏ13 కట్టా సురేంద్రనాయుడుకు మూడు రోజులు కస్టడీకి ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ములకలచెరువులో జరుగుతున్న నకిలీ మద్యం తయారీ గుట్టును ఈ నెల 3వ తేదీ ఎక్సైజ్ ఉన్నతాధికారులు రట్టు చేసి 10 మంది నిందితులైన విశాఖపట్నంకు చెందిన సయ్యద్‌హాజీ, వాహన డ్రైవర్ బాలరాజు, తమిళనాడుకు చెందిన మనిమారన్, ఆనందన్, సూర్య, సురేష్, ఒరిస్సాకు చెందిన మిధున్, ఆనంద్ దాస్, పీటీఎం మండలం కమ్మవారిపల్లెకు చెందిన కట్టా సురేంద్రనాయుడు, రంగసముద్రంకు చెందిన బెల్ట్‌షాపు నిర్వాహకుడు నాగరాజును అదుపులోకి తీసుకుని మరుసటి రోజు అరెస్టు చూపి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించడంతో మదనపల్లె సబ్‌జైలుకు తరలించారు. ఎక్సైజ్ అధికారులు నిందితుల కస్టడీకి కోరుతూ పిటీషన్ దాఖలు చేశారు. విచారించిన జడ్జి తొమ్మిది మంది నిందితులను ఈనెల 17, 18వ తేదీలలో, కట్టా సురేంద్రనాయుడును 17, 18, 19 వతేదీలల్లో కస్టడీకి అనుమతిస్తూ ఆదేశాలు ఇచ్చారు. దీంతో శుక్రవారం మదనపల్లె సబ్‌జైలులో ఉన్న 10 మంది నిందితులను ప్రత్యేక బలగాల నడుమ ములకలచెరువు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించనున్నారు.

జనార్దన్‌రావు పీటీ వారెంట్ వాయిదా

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మద్దేపల్లి జనార్దన్‌రావును అరెస్టు చూపేందుకు అనుమతి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు తంబళ్లపల్లెలో దాఖలు చేసిన పీటీ వారెంట్‌ను జడ్జి గురువారానికి వాయిదా వేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. జనార్దన్‌రావుతో పాటు శ్రీనివాసులురెడ్డిని కూడా అరెస్టు చేసేందుకు పీటీ వారెంట్ దాఖలు చేశారు. ఇద్దరి పీటీ వారెంట్‌లను జడ్జి వాయిదా వేశారు.

జనార్దన్‌రావు ఇంట్లో సిట్ అధికారుల సోదాలు

ములకలచెరువు నకిలీ మద్యం కేసులో ఏ1 జనార్దన్‌రావు ఇంట్లో మంగళవారం రాత్రి సిట్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని జనార్దన్‌రావు ఇంటికి వెళ్లిన సిట్ అధికారులు సోదాలు చేసి పలు కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడైంది. ఇంట్లో లభించిన ల్యాప్‌టాప్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. అలాగే జనార్దన్‌రావు కుటుంబ సభ్యులను విచారించారు. మంగళవారం రాత్రి పొద్దుపోయే వరకు సోదాలు కొనసాగాయి.

కందుకూరులో విషాదం

- ఇటుకల తయారీ కేంద్రంలో విద్యుదాఘాతంతో ఇరువురి మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన బిహార్‌కు చెందిన షహానీ, ఇంద్రెషహానీ

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రంలో విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు వలస కార్మికులు దుర్మరణం చెందిన విషాదకర సంఘటన పెద్దతిప్పసముద్రం మండలం కందుకూరులో జరిగింది. పోలీసులు, స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కందుకూరు గ్రామంలోని వడ్డిపల్లె రోడ్డులోని జయలక్ష్మీ కల్యాణ మండపం పక్కన ములకలచెరువుకు చెందిన రాజశేఖర్‌కు సిమెంట్ ఇటుకల తయారీ కేంద్రంలో బిహార్‌కు చెందిన కార్మికులు కొందరు నాలుగు నెలలుగా పనిచేస్తున్నారు. షహానీ, ఇంద్రెషహానీ అనే కార్మికులు బుధవారం ఉదయం ఇటుకలను తయారు చేసేందుకు యంత్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా ఆ యంత్రానికి విద్యుత్ సరఫరా కావడంతో వారిద్దరూ విద్యుత్ షాక్‌కు గురయ్యారు. గమనించిన స్థానికులు అక్కడికి వెళ్లి విద్యుత్ సరఫరాను నిలిపేశారు. అయితే వారిద్దరూ అప్పటికే మృతి చెందారు. అక్కడే ఉన్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో బి.కొత్తకోట సీఐ గోపాల్‌రెడ్డి, ములకలచెరువు ఎస్ఐ నరసింహుడు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని వారి వివరాలను నమోదు చేసుకుని మృతదేహాలను మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాగా ఇటుకల తయారీ కేంద్రం నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేసి సమగ్ర విచారణ జరిపించాలని, మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐటీయూసీ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, ఉప ప్రధాన కార్యదర్శి సలీం బాష, తంబళ్లపల్లె నియోజకవర్గం అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డిలు డిమాండ్ చేశారు.

తెగిపోయిన హంద్రీ-నీవా కాలువ

- కుప్పంకు కృష్ణాజలాల తరలింపునకు బ్రేక్
- కాలువను పరిశీలించిన కలెక్టర్ నిశాంత్‌కుమార్



సిమెంట్ లైనింగ్ సహా గట్టు తెగిపోయి బయటకు వెళుతున్న కృష్ణా జలాలు

బి.కొత్తకోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట మండలం గట్టు పంచాయతీ పరిధిలోని గుండ్లపల్లె శివారు 110.925 కి.మీ వద్ద ఉన్న యూటీ సమీపంలో హంద్రీ-నీవా కాలువ గట్టు బుధవారం ఉదయం తెగిపోయింది. దీంతో కాలువగుండా వస్తున్న ప్రవాహం దిగువ వైపునకు ఉధృతంగా ప్రవహించింది. తరిగోడు వద్ద ఏర్పాటు చేసిన 12వ ఎత్తిపోతల పథకం నుంచి నీటి పంపింగ్ ఆగిపోవడంతో కాలువ తెగిపోయిందని అధికారులు తేల్చారు. మంగళవారం రాత్రి బి.కొత్తకోట మండల వ్యాప్తంగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ వర్షం ధాటికి హంద్రీ-నీవా లిఫ్టుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్‌లోని కొన్ని స్తంభాలలో ఇన్సులేటర్లు దెబ్బతిన్నాయి. దీంతో తరిగోడు లిఫ్టులోని మోటార్లకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. మోటార్లు పనిచేయక పంపింగ్‌కు బ్రేక్ పడింది. అయితే దిగువ భాగంలోని పీ9, పీ10, పీ11 నుంచి పంపింగ్ ద్వారా వస్తున్న నీటితో కాలువ నిండిపోయింది. పరిస్థితిని చక్కదిద్దేందుకు హంద్రీ-నీవా సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. నీటి తాకిడికి కాలువ పొంగి గుండ్లపల్లె వద్ద తెగిపోయింది. దీంతో చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచే నీటి ప్రవాహాన్ని ఆపివేయడంతో పాటు దిగువనున్న మూడు లిఫ్టులను ఆపివేశారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పరిశీలించిన కలెక్టర్ నిశాంత్‌కుమార్

గుండ్లపల్లె వద్ద తెగిపోయిన హంద్రీ-నీవా కాలువను కలెక్టర్ నిశాంత్ కుమార్ పరిశీలించారు. విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పంపింగ్ జరగని కారణంగానే కాలువ తెగిపోయిందని హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ విఠల్ ప్రసాద్ కలెక్టర్‌కు వివరించారు. కుప్పం వైపు నిర్విరామంగా జరుగుతున్న కృష్ణా జలాల తరలింపునకు ఈ ఘటనతో బ్రేక్ పడిందని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని, కాలువకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసి నీటి తరలింపును ప్రారంభించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను గుండ్లపల్లె గ్రామస్థులు కలిసి హంద్రీ-నీవా కాలువ అవతలి వైపు తమ వ్యవసాయ పొలాలతో పాటు, గ్రామదేవత గుడి ఉందని, కాలువ నిర్మాణంతో గుడికి, పొలాలకు రాకపోకలకు ఇబ్బందిగా మారిందని బ్రిడ్జిని నిర్మించాలని విన్నవించారు. కార్యక్రమంలో హంద్రీ-నీవా ఈఈలు అమరనాథరెడ్డి, రాజగోపాల్, డీఈ ప్రతాప్, ఏఈ ఆంజనేయులు, ఎంపీడీవో అబ్దుల్‌షకూర్, డీటీ బాలాజీ, ఆర్ఐ వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులకనుగుణంగా

సన్నద్ధం కావాలి

- పైలెట్ ప్రాజెక్టుగా లక్కిరెడ్డిపల్లె, చిన్నమండెం మండలాలు
- కలెక్టర్ నిశాంత్‌కుమార్



ఎన్జీవో, ఎస్‌హెచ్‌జీ మహిళలతో కలెక్టర్, జిల్లా అధికారులు

రాయచోటి (నేతాజీ సర్కిల్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వాతావరణ మార్పులకు అనుగుణంగా రైతులు సన్నద్ధం కావాలని, వ్యవసాయంలో ముందస్తుగా అనుకూల మార్పులు చేపట్టేందుకు జిల్లాలోని లక్కిరెడ్డిపల్లె, చిన్నమండెం మండలాలు పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో యునైటెడ్ నేషన్స్ వరల్డ్ ఫుడ్ ప్రోగ్రాం రెండు రోజుల జిల్లా స్థాయి వర్క్‌షాపులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఉపాధి మార్గాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒరిస్సా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ మూడు రాష్ట్రాలు పైలెట్ ప్రోగ్రాం కింద ఎంపికయ్యాయని, అందులో అన్నమయ్య జిల్లాలోని వెనుకబడిన మండలాలుగా ఉన్న లక్కిరెడ్డిపల్లె, చిన్నమండెం ఎంపిక కావడం అభినందించదగ్గ విషయమన్నారు. వాతావరణంలో అనూహ్య మార్పులు రావటం పెద్ద సమస్యగా మారిందని, వర్షాలు పడే కాలంలో వర్షాలు తక్కువగా ఉండడం పంటలు పండే సమయంలో వర్షాలు రాకుండా ఆగిపోవడం అలాగే పంట చేతికి వచ్చే సమయంలో అకాల వర్షాలతో పంట నష్టాలు జరగడం జరుగుతున్నదని, ఇలా వ్యవసాయ రంగం సైకిల్ పూర్తిగా దెబ్బతింటోందన్నారు. అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో ఆకస్మాత్తుగా మారే వర్షపాతం వల్ల ఏ విధంగా పంటలు దెబ్బతింటాయో ప్రత్యక్షంగా చూశానని అందుకే ఇలాంటి ప్రాజెక్టులు చాలా ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. జాతీయ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ బాలాజీ త్రిపాటి మాట్లాడుతూ ఈ పథకం రైతుల జీవన విధానంలో మార్పులకు దోహదమవుతుందని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి శివనారాయణ, ప్రకృతి వ్యవసాయ రైతు సాధికార సంస్థ ప్రతినిధి సౌమ్య, జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి వెంకటమోహన్, వివిధ శాఖల అధికారులు, ఎన్జీవోలు, ఎఫ్‌పీవో, ఎస్‌హెచ్‌జీ గ్రూప్ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ





బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న జగన్‌మోహన్‌రాజు, సాయిలోకేశ్, ముక్కారూపేష్‌రెడ్డి

రాజంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధి చెక్కులు అందజేయడం పేదలపాలిట ఓ వరమని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వివిధ బాధితులకు రూ.11.42 లక్షలను చెక్కు రూపంలో పేదలకు అందజేశామన్నారు. పేదల కష్టాలను తీర్చడమే సీఎం చంద్రబాబు ఆశయమన్నారు. సీఎం సహాయ నిధి ద్వారా ఎన్నో కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఇప్పటికే ఎంతోమంది ప్రాణాలను కాపాడడంలో కూటమి ప్రభుత్వం కీలక భూమిక పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: మండల పరిధిలోని కొర్లకుంట క్రాస్‌రోడ్డు పరిధిలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో సీఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసినట్లు మండల అధ్యక్షుడు ముక్కా రూపేష్‌రెడ్డి తెలిపారు. కొర్లకుంట క్రాస్ రోడ్డులోని బీజేపీ సీనియర్ నాయకుడు వీటీ చెంగల్‌రెడ్డి ఇంటివద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్, నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం చెంగల్‌రాజులు హాజరై సీఎంఆర్ఎఫ్ కింద వివిధ లబ్ధిదారులకు మొత్తం 4.80 లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయిలోకేష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో పార్టీలకతీతంగా ఇబ్బందులుపాలైన కుటుంబాలకు ఆర్థికంగా సహాయం అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణయ్యయాదవ్, సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ ఎ.శంకరయ్య, కె.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి జె.కేశవరాజు, వేణుగోపాల్‌రెడ్డి, రాజేష్ వర్మ, శశి తదితర బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకలు పంపిణీ



పలకలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఎంపీపీ స్కూల్‌లో రాయచోటి వీరభద్రస్వామి ఆలయ ఈవో సహకారంతో జిల్లెళ్ల రాజశేఖర్ ఆధ్వర్యంలో ఎంఈవో చక్రేనాయక్ బుధవారం పలకలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ అన్నిదానాల కన్నా విద్యాదానం చాలా గొప్పదని విద్యార్థులకు పలకలు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు మెటీరియల్ అందించడం గొప్ప విషయమన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయిని అధిరోహించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఏవీ రెడ్డిసుబ్బారెడ్డి, రాధారాణి, సుర్ణముఖి, గంగాధర తదితరులు పాల్గొన్నారు.

విశాఖ గూగుల్ ఏఐ హబ్ కీలకపాత్ర

● రాష్ట్ర పాలఏకరి చైర్మన్ నాగేశ్వర్‌నాయుడు



మాట్లాడుతున్న నాగేశ్వర్‌నాయుడు

రాయచోటి(నేతాజీసర్కిల్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వేదికపై విశాఖ గూగుల్ ఏఐ హబ్ కీలకపాత్ర పోషిస్తుందని రాష్ట్ర పాలఏకరి చైర్మన్ నాగేశ్వర్‌నాయుడు తెలిపారు. ఆ మేరకు బుధవారం ఆయన స్వగృహంలో విలేకర్లతో మాట్లాడుతూ విశాఖ ఏఐ హబ్ కేవలం ఆంధ్రప్రదేశ్, గూగుల్‌కే కాదని, యావత్ భారతదేశానికి చారిత్రాత్మకమైందన్నారు. గూగుల్ డేటా సెంటర్ గ్రామీణ స్థాయిలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి విస్తృతమైన సేవలను అందించబోతోందన్నారు. న్యూఢిల్లీలోని తాజ్‌మాన్ సింగ్ హోటల్‌లో విశాఖ ఏఐ హబ్ ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం గూగుల్ ప్రతినిధి బృందం నడుమ కీలక అవగాహన ఒప్పందం జరగడం హర్షించదగ్గ విషయమన్నారు.

పట్టు సాగుపై దృష్టి పెట్టండి

రామాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టు సాగు చేసే రైతు పట్టు పరిశ్రమపై దృష్టి సారించాలని అనంతపురం పట్టు పరిశ్రమ శాస్త్రవేత్త రమ్య, పట్టు పరిశ్రమ ఏడీ రాధాలు అన్నారు. మండలంలోని బండపల్లి పంచాయతీ పరిధిలోని కేంద్ర పట్టు పరిశ్రమ కార్యాలయంలో బుధవారం పట్టు సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ మల్బరీ సాగు ప్రారంభించే ముందు మట్టి పరీక్ష తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగమణి, పట్టు పరిశ్రమ సిబ్బంది నాగసుబ్బరాయుడు, పట్టు రైతులు పాల్గొన్నారు.

జీవన ఎరువులు సహజమైనవి

● కృషి విజ్ఞాన్ సమన్వయకర్త అంకయ్యకుమార్



జీవన ఎరువులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఒంటిమిట్ట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవన ఎరువులు సహజసిద్ధమని, వాటివల్ల వాతావరణ కాలుష్యం పంటలకు హాని కలగవని కృషివిజ్ఞాన కేంద్రం ఊటుకూరు సమన్వయ కర్త డాక్టర్ అంకయ్యకుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని నరసన్నగారిపల్లెలో కేవీకే ఊటుకూరు ఆధ్వర్యంలో జీవన ఎరువులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవగాహన కల్పించడం కోసం విశ్వవిద్యాలయం తరపున ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు జీవన ఎరువులపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతుల అధిక దిగుబడి కోసం ఇష్టానుసారంగా పురుగు మందులు, ఎరువుల వాడకం వల్ల నేల నిస్సారమై నీటి పర్యావరణ కాలుష్యం జరిగి అనారోగ్యాలకు గురవుతారన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ మహేష్‌బాబు, మండల వ్యవసాయ అధికారి మంజులరాణి, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మండల టీడీపీ కమిటీ ఎంపిక





నరసింహారెడ్డి, ఈశ్వరయ్య

ఒంటిమిట్ట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ అధ్యక్షుడిగా గజ్జల నరసింహారెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నియోజకవర్గ పరిశీలకుడు చిట్టిబాబు తెలిపారు. బుధవారం రాజంపేటలోని ఏబీ చంద్రారెడ్డి కల్యాణమండపంలో మండల టీడీపీ కమిటీని ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ మండల పార్టీ అధ్యక్షుడిగా గజ్జల నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆలూరు వెంకటసుబ్బయ్య, మండల క్లస్టర్ కన్వీనర్‌గా తుమ్మలకుంట ఈశ్వరయ్య, కోకన్వీనర్‌గా కట్టా సుబ్బరాయుడులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. మండలంలో టీడీపీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): 33/11కెవి మన్నూరు ఫీడర్‌లో లైన్ల మధ్యలో ఉన్న చెట్ల కొమ్మలు తొలగించేందుకు, మరమ్మతులు చేపట్టేందుకు గురువారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాసరావు పేర్కొన్నారు. పట్టణంలోని ఎర్రబల్లె, సాయినగర్, మన్నూరు, బైపాస్ వీటి ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

కోల్డ్ స్టోరేజీల ఏర్పాటుకు కృషి : చైర్‌పర్సన్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వరలక్ష్మి

పుల్లంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తమ నాయకుడు పవన్‌కళ్యాణ్ సారథ్యంలో రైల్వేకోడూరు మార్కెట్‌యార్డును అభివృద్ధిపథంలో పయనిస్తామని రైల్వేకోడూరు మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ వరలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ ప్రాంతాల్లో రైతులు పంటలను తరలించేందుకు పక్కాగా రోడ్లు వేస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు అధికారులు, నాయకులు, వ్యాపారులను సమన్వయం చేసి న్యాయం చేస్తామని తెలిపారు. ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో బెల్టుషాపులు 354 ఉన్నాయని, ఒక్కో గ్రామానికి 2 నుంచి 3, 6 బెల్టుషాపులు ఉన్నా ఎక్సైజ్‌శాఖ ఏమాత్రం చీమకుట్టినట్లు కూడా లేదన్నారు. మండలంలో భూ అక్రమాలు జరిగినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎంపీడీవో జయశ్రీతో పాటు వివిధ శాఖల అధికారులు తమ శాఖల పనితీరును జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జయశంకర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పలువురు బీజేపీలో చేరిక

రాజంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాజంపేట బీజేపీ పార్లమెంట్ కార్యాలయంలో బుజ్జమ్మ ఆధ్వర్యంలో పెనగలూరు మండలం ఓబిలి గ్రామ ప్రజలు బుధవారం బీజేపీలో చేరారు. సాయిలోకేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సునీత, స్థానిక నాయకురాలు బుజ్జమ్మ, మహిళా మోర్చ ఇన్‌చార్జి ఆదిలక్షుమ్మల సమక్షంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణయాదవ్, దళిత మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమణయ్య, జిల్లా కార్యదర్శి నరేంద్ర, పట్టణ అధ్యక్షుడు వీవీ రమణ, పెనగలూరు మండల అధ్యక్షుడు రెడ్డికృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎన్.గిరీష్, పుల్లంపేట మండల నాయకులు శ్రీనివాసులు, నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం అడుగుజాడల్లో నడవాలి : ప్రిన్సిపాల్



మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

రైల్వేకోడూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఏపీజే అబ్దుల్‌కలాం అడుగుజాడల్లో విద్యార్థిని, విద్యార్థులు నడవాలని ప్రిన్సిపాల్ యం.భాస్కర్‌రెడ్డి తెలిపారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆయన దేశానికి చేసిన సేవలు అనేకం ఉన్నాయని తెలిపారు. ఆయన పేద కుటుంబం నుంచి వచ్చి అంచెలంచెలుగా ఎదిగారని కొనియాడారు.

రాజంపేటటౌన్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతిని రాజంపేట మండలం కొత్తబోయనపల్లె పీఎంశ్రీఎస్ జేఎస్‌ఎం జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయురాలు కె.భారతి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘననివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ అబ్దుల్‌కలాం శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా ఈ దేశానికి అనేక సేవలందించిన మహావ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.జనార్దన్, బి.శేషగిరి, శివప్రసాద్‌గౌడ్, ఎస్.ప్రభాకర్‌రావు, పి.విజయభాస్కర్, శ్రీరాములు, అనిల్‌కుమార్, ఎన్.రాధయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: రాజంపేట పట్టణం జనసేనపార్టీ కార్యాలయంలో శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో భారతరత్న ఏపీజే అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన పార్టీ, కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయంలో..

భారతరత్న ఏపీజే అబ్దుల్‌కలాం 93వ జయంతిని పురస్కరించుకుని రాజంపేట బీజేపీ పార్లమెంట్ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రముఖ సైంటిస్టు, శాస్త్రవేత్తలుగా దేశానికి చేసిన సేవలు మరువలేమన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోడూరు సీనియర్ నాయకుడు ఆదినారాయణ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ అధ్యక్షుడు షబ్బీర్‌అహ్మద్, రాష్ట్ర దళిత మోర్చ కార్యవర్గ సభ్యుడు రమణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణయాదవ్, సునీత, నరేంద్ర, వీవీ రమణ, రమణయ్య, బీజేపీ నాయకులు, కార్యరకర్తలు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: దేశ రక్షణ వ్యవస్థ, ఆధునిక శాస్త్రం సాంకేతికతను ఊతంగా అందించి మిస్సైల్ మ్యాన్‌గా కీర్తించబడిన గొప్ప వ్యక్తి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను బుధవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్‌ఖాన్ ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భవిష్యత్ తరాలకు స్ఫూర్తి చంద్రబాబు, లోకేశ్

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా



రాయచోటిటౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు, ఆయన కుమారుడు లోకేశ్‌బాబులు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు ఖాదర్‌బాషా అన్నారు. బుధవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ నాడు ఉమ్మడి ఏపీ సీఎంగా చంద్రబాబు అమెరికా నుంచి మైక్రోసాఫ్ట్ కంపెనీని హైదరాబాదుకు తీసుకురాగా, నేడు ఆయన కుమారుడు రాష్ట్ర ఐటీ విద్యాశాఖ మంత్రి లోకేశ్ అమెరికా నుంచి గూగుల్ కంపెనీని విశాఖపట్నంకు తీసుకొచ్చి చరిత్రను తిరగరాశారన్నారు. గూగుల్ కంపెనీతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం చరిత్రలో ఒక మైలురాలు అని కొనియాడారు. ఏఐ డేటా సెంటర్ పూర్తయితే మొదటి సంవత్సరంలో ఒక లక్షా 80 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు.

సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం

చిన్నమండెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని కస్తూర్బాగాంధీ హైస్కూల్‌లో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్టేట్‌బ్యాంక్ లీడ్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఆంజనేయులు హాజరై మాట్లాడుతూ ఫైనాన్షియల్ డిజిటల్ ట్రాన్సాక్షన్‌పై జరుగుతున్న మోసాల నివారణ చర్యల గురించి వివరించారు. సైబర్ క్రైమ్ జరిగినప్పుడు టోల్‌ఫ్రీ నెంబర్ 1930 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ కళాశాల ప్రిన్సిపాల్ దివ్య, పీఐడీఎస్ కౌన్సిలర్ ఆంజనేయులు, తిరుమలయ్య, విద్యార్థినీలు పాల్గొన్నారు.

డ్రాపౌట్‌ను అరికట్టాలి

● సమగ్ర శిక్ష ప్రత్యామ్నాయ స్కూల్ కోఆర్డినేటర్



విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలిస్తున్న వెంకట్రామయ్య

గాలివీడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల హాజరుపై దృష్టి పెట్టి డ్రాపౌట్‌లను అరికట్టాలని సమగ్ర శిక్ష ప్రత్యామ్నాయ స్కూల్ కోఆర్డినేటర్ వెంకట్రామయ్య, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు సూచించారు. బుధవారం మండలంలోని పలు పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం విద్యార్థుల హాజరు రిజిస్టర్లు పరిశీలించి దీర్ఘకాలంగా తరుచూ గైర్హాజరయ్యే విద్యార్థులను గుర్తించారు. తదుపరి ఆయన ఎఫ్ఏ-2 పరీక్షల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు అంశాలను సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు నాగరాజు, శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు జాఫర్‌బాషా, కృష్ణానాయక్, రమణారెడ్డి, వెంకటలయ్య, సీఆర్పీలు, తదితరులు పాల్గొన్నారు.

40 ఏళ్ల తర్వాత దారికి మోక్షం

● రోడ్డుకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే



రోడ్డుకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే, విప్ శ్రీధర్

రైల్వేకోడూరురూరల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని కోనయల్లమ్మ ఆలయానికి వెళ్లే దారికి 40 ఏళ్ల తర్వాత మోక్షం ఏర్పడింది. బుధవారం జనసేన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ శ్రీధర్ రూ.18 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 40 ఏళ్లుగా ఈ ఆలయానికి రోడ్డు సౌకర్యం లేక ప్రజలు, భక్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి తీసుకుని వచ్చారని తెలిపారు. ప్రజల కోరిక మేరకు రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మల్లికార్జునరెడ్డి, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరిపిస్తాం: మండిపల్లి

గాలివీడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చిన్నారి గోపిక (14) మృతిపై సమగ్ర విచారణ జరిపించి వారి కుటుంబానికి న్యాయం చేస్తామని రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు మండిపల్లి లక్ష్మిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం చిన్నారి గోపిక మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని పూలుకుంట పంచాయతీ గుంటికాడపల్లెకు వచ్చి వారి కుటుంబ సభ్యులైన సుదర్శన్‌రెడ్డిని, నాగేశ్వర్‌రెడ్డిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారి మృతికి కారకులైన వారందరిపై సమగ్ర విచారణ జరిపించేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పూలుకుంట సర్పంచ్ పార్థసారధిరెడ్డి, మండల టీడీపీ నాయకుడు కుమార్‌రెడ్డి, టీడీపీ నాయకులు కొండారెడ్డి, నాగేశ్వరరావు, సాయిప్రసాద్‌రెడ్డి, నూలివీడు, గాలివీడు సొసైటీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

రైల్వేకోడూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసేంత వరకు ఉద్యమాలు ఆగవని రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఆర్గనైజేషన్ కార్యదర్శి కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరులో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 27 వేల మంది విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు ఉన్నారని, కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. చర్చలు విఫలమైతే సమ్మెబాట పడతామన్నారు. సమావేశంలో నాయకులు సుబ్రహ్మణ్యం, సీహెచ్ నారాయణ, యు.రమేష్, ఎస్.సుధాకర్, ఎంవీ రమణ, జయక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఒంటిమిట్ట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ కుటుంబ పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు తెలిపారు. బుధవారం మండలంలోని నరవకాటిపల్లి సచివాలయంలో కీటక జనిత వ్యాధుల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం స్థానిక ఎంపీపీ పాఠశాలలో చేతుల పరిశుభ్రత గురించి పిల్లలకు తెలియజేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాస్కర్‌రెడ్డి, సీహెచ్‌వో హవిలా, ఆశా కార్యకర్త వనిత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దవటం: విద్యార్థులు పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతులుగా ఉంటారని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రమైన సిద్దవటం, ఎగువపేటలోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో పి.కొత్తపల్లె ప్రైమరీ హెల్త్‌సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రంగలక్ష్మీ ఆధ్వర్యంలో బుధవారం 1 నుంచి 5వ తరగతి విద్యార్థులకు శుభ్రత, పరిశుభ్రతపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో లక్ష్మీనరసమ్మ, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య కార్యకర్తలు అంజనమ్మ, శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్‌డే



డ్యాన్సు వేస్తున్న విద్యార్థినులు

రైల్వేకోడూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఘనంగా ఫ్రెషర్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులు కలిసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆట, పాటా మధ్య విద్యార్థులు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపాల్ ఎం.భాస్కర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.రమేష్, ఐక్యూ ఏసీ కో-ఆర్డినేటర్ జి.దయానందం, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ దాసరి మోషే, వికసిత్ భారత్ కో-ఆర్డినేటర్ కె.క్రిష్ణమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి : పీడీ

సుండుపల్లె, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపాధిలో ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని పీడీ వెంకటరత్నం తెలిపారు. సుండుపల్లె మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఉపాధిలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ఈకేవైసీ నిర్వహిస్తోందన్నారు. ఉపాధి పనులు చేయాలంటే ఉపాధి కార్డులో ఎంత మంది ఉంటే అంత మంది ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మాలిక్‌బాషా, ప్రాజెక్టు ఆఫీసర్ అశోక్, జనసేన నాయకులు రామశ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ సుబ్బారావుకు ఎక్సలెన్స్ అవార్డు



డాక్టర్ సుబ్బారావు

రాజంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నమాచార్య యూనివర్శిటీకి చెందిన డాక్టర్ ఎం.సుబ్బారావు గురు ఎక్సలెన్స్ అవార్డు-2025 అందుకున్నారు. మీరట్‌లోని ఆరాధ్య- ఏక్ ఎహస్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఈ అవార్డు ప్రదానోత్సవం నిర్వహించారు. విద్యారంగంలో అంకితభావంతో సేవలందిస్తూ విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించినందుకు ఆయనకు ఈ గౌరవం దక్కింది. కాగా అవార్డు గ్రహీతను వైస్‌చాన్సలర్ సాయిబాబారెడ్డి, ప్రో చాన్సలర్ సి.అభిషేక్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

లాభాల సాగు...

- అంతరపంటలతో చీడపీడల నివారణ
- దిగుబడి అధికం

పత్తిలో కందిపంట సాగు



మిరపలో అంతరపంటగా గుండుమల్లె సాగు



మొక్కజొన్నలో మగమొక్కజొన్న



రాజుపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్, రబీలో సాగు చేస్తున్న కంది, మినుము, మిరప, మొక్కజొన్న, పసుపు తదితర పంటల్లో అంతర పంటలు సాగు చేయడం ద్వారా చీడపీడల నివారణతో పాటు రైతన్నలకు మంచి లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయాధికా రులు సూచిస్తున్నారు. పత్తి పంటలో రెండుసాళ్లకు ఒకసాలు కంది సాగు చేయడం ద్వారా పచ్చపురుగుతో పాటు చీడపీడలు ఎక్కువగా సోకకుండా నివారించవచ్చు. పురుగులు ఎక్కువగా కందిపంటపైనే ఉండడంతో మందు పిచికారి చేయడం ద్వారా రెండు పంటలను రక్షించుకోవచ్చన్నారు. అలాగే మిరపలో బంతిపూల చెట్లు నాటడం ద్వారా తెగుళ్లను, బంతిపూలను పురుగు ఆశించడం ద్వారా మందు ప్రభావంతో నివారించడంతో పాటు దిగుబడి పెంచుకునేందుకు వీలుంటుందన్నారు. అదే విధంగా మొక్కజొన్నలో అంతరపంటగా మగ మొక్కజొన్నలు నాటడం ద్వారా కమర్షియల్ పంటకు క్వింటాకు రూ.2వేలు పలికితే సీడ్ మొక్కజొన్నకు క్వింటా రూ.6వేలు పలుకుతోంది. ఇది రైతులకు మంచి లాభదాయకమన్నారు. ఈ విధంగా పంటలు వేసుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోవడంతో పాటు రెండు దిగుబడులు పొంది రైతన్నలు లాభాలు పొందవచ్చని వ్యవసాధికారులు సూచిస్తున్నారు.

పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు

మైలవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా సంజాముల మండలం నొస్సం గ్రామానికి చెందిన ఓ మహిళ తన ముగ్గురి పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిం చింది. కుటుంబ సమస్యల కారణంగా తన ముగ్గురి పిల్లలను తీసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి బుధవారం మైలవరం జలాశయం వద్దకు రాగా స్థానికులు గమనించి మైలవరం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు వారిని కాపాడారు. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా... జమ్మలమడుగులోని భాగ్యనగర్ కాలనీకి చెందిన మహిళను నొస్సం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. కుటుంబ సమస్యల కారణంగా ఇద్దరు కూతుర్లు, కుమారునితో జమ్మలమడుగుకు వచ్చి.. అక్కడి నుంచి ఆటోలో మైలవరం జలాశయం వద్దకు చేరుకుని జలాశయం గేట్ల వద్ద ఆత్మహత్య చేసుకోవడానికి చూస్తుండగా గమనించిన ఓ ఆటో డ్రైవర్ మైలవరం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే మైలవరం పోలీసులు అక్కడకు చేరుకుని, ఆమెతో పాటు పిల్లలను మైలవరం పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం , కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించినట్లు ఏఎస్‌ఐ లక్ష్మిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ రియాజ్‌లు తెలిపారు.

నిప్పంటించుకొని మహిళ ఆత్మహత్య

ప్రొద్దుటూరు, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం సుందరాచార్యుల వీధిలో నివాసం వుండే షేక్ అబీదా (42) అనే ఒంటరి మహిళ బుధవారం ఆత్మహత్యకు పాల్పండింది. వన్‌టౌన్ ఎస్‌ఐ సంజీవరెడ్డి వివరాల మేరకు షేక్ అబీదా గోపల్లెకు చెందిన వ్యక్తితో వివాహమైంది. మనస్పర్థలం కారణంగా విడిపోయి కుమారుడితో కలిసి జీవిస్తుండేది. ఆమెకు ఒక్కగానొక్క కుమారుడు ఖాసీం 18 నెలల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆబీదా ఒంటరి జీవితంతో మనస్థాపం చెంది నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తల్లి మెహరూన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నిమ్మనపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన హరీష్ (25) తిరుపతిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లి వడ్డిపల్లికి చెందిన వెంకటరమణ కుమారుడు హరీష్ బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తుండేవాడు. అయితే అతను మదన పల్లిలో సొంతంగా బ్యాటరీ దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు తల్లిదండ్రులను అడిగాడు. దీనికి వారు వద్దని చెప్పడంతో మన స్థాపం చెంది ఈనెల 5వ తేదీ ఇంట్లో వున్న విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించగా, రుయా ఆస్పత్రిలో చికిత్స బుధ వారం మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంటు...

గోపవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచాయిపేట పంచాయతీ పరిధిలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంటుగా పనిచేస్తున్న వేముల వెంకటేశ్వర్లు (40) అనారోగ్యానికి గురై నెల్లూరులో చికిత్స పొందుతూ బుధ వారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... మృతుడు వెంకటేశ్వర్లు నాలుగు రోజుల కిందట విధి నిర్వహణలో ఉండగా పక్షవాతం సోకింది. వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బైపాస్‌రోడ్డు విస్తరణ పనులు



కల్వర్టు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రొద్దుటూరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు శివారులోని ఎర్రగుంట్ల బైపాస్‌రోడ్డు నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా బుధవారం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోని రిలయన్స్ పెట్రోలు బంకు వద్ద కల్వర్టు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బైపాస్ రోడ్డుతోపాటు పొట్టిపాడు రోడ్డు, కొర్రపాడు రోడ్డు, విస్తరణల కోసం ఆర్‌అండ్‌బీ శాఖకు సుమారు రూ.30 కోట్లు మంజూరు చేసిందన్నారు. పనులను త్వరగా పూర్తి చేసి ప్రొద్దుటూరును సుందరీకరణగా తీర్చిదిద్దుతామన్నారు. కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ రామాంజనేయులు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు తోట మహేష్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డీఆర్‌ఎం



ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో సూచనలు చేస్తున్న డీఆర్‌ఎం

ఎర్రగుంట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేష్టేషన్‌ను బుధవారం గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ సీఎస్ గుప్తా సందర్శించారు. స్టేషన్‌లో పరిశుభ్రతపై ఆరా తీశారు. అన్ని గదులను, రైల్వే ఫ్లాట్‌ఫారాలను, రైల్వే ఇంజిన్ డ్రైవర్స్ రెస్ట్ రూంను ఆయన పరిశీలించారు. స్టేషన్‌లో జరుగుతున్న పలు పనులపై ఆయన ఆరా తీసి పలు సూచనలు చేశారు. అనంతరం ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ చుట్టూ ఉన్న సిమెంట్ పరిశ్రమల యాజమాన్య హెచ్‌ఓడీలతో ఆయన ఎర్రగుంట్లలోని అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైల్వే నుంచి రవాణా విషయంలో పరిశ్రమలకు గల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా లోడింగ్ మరింత పెంచి రైల్వేల అభివృద్ధికి పూర్తి సహకారాలు అందించాలని కోరారు. అయితే సైడింగ్స్‌లో ఉన్న సమస్యలపై పరిశ్రమల వారు డీఆర్‌ఎంకు వివరించారు. అలాగే స్పీడ్ పెంచాలని కోరారు. ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ నుంచి అల్ట్రాటెక్ పరిశ్రమకు వెళుతున్న సైడింగ్‌ను మరింత అభివృద్ధి చేయాలన్నారు.

యూజీడీ నిర్మించాలని వినతి

ఎర్రగుంట్ల నుంచి జువారి కర్మాగానికి వెళుతున్న రైల్వేట్రాక్ ఎర్రగుడిపాడు రస్తా వద్ద రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని నిర్మించాలని ఏఎంసీ చైర్మన్ నాగరాజు, కత్తి ప్రతాప్‌రెడ్డి తదితరులు డీఆర్‌ఎంకు వినతి పత్రం ఇచ్చారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న దృష్ట్యా వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సీనియర్ డివిజనల్ అధికారులు, స్థానిక అధికారులు డీఆర్‌ఎం వెంట ఉన్నారు.

రాయచోటిలో 50 ఎకరాల్లో టిడ్కో ఇళ్లు

- శిబ్యాల పరిధిలోని భూమి అప్పగింతకు ఆదేశాలు
- ఎన్టీఆర్‌నగర్ పేరుతో ఇళ్ల సముదాయం

కలికిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో టిడ్కో ఇళ్లు నిర్మించడానికి ప్రభుత్వం సన్నాహాలు మొదలు పెట్టింది. పట్టణ శివారులో టిడ్కో ఇళ్ల నిర్మాణం కోసం 50 ఎకరాలను వెంటనే ఏపీ టిడ్కో మేనేజింగ్ డైరెక్టరు పేరుతో బదలాయించాల్సిందిగా కలెక్టరును ఆదేశిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాయచోటి శివారు శిబ్యాల గ్రామంలోని 50 ఎకరాలకు రూ.1.34 కోట్ల ధర నిర్ణయించింది. టిడ్కో ఇళ్ల నిర్మాణం కోసం జూలై 16న కలెక్టరు పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించి ఏపీ టిడ్కోకు కేటాయించింది. శిబ్యాల గ్రామ సర్వే నం.2215లో 13 ఎకరాలు, 2216లో 19 ఎకరాలు, 2217లో 18 ఎకరాలు కలిపి మొత్తం 50 ఎకరాల ప్రభుత్వ భూమికి రూ.1.34 కోట్లు ఏపీ టిడ్కో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. అయితే ముందస్తుగా భూమిని అప్పగిస్తే అందులో రోడ్లు, ఇతరత్రా అభివృద్ధిని చేపట్టిన అనంతరం వచ్చే రాబడిని అనుసరించి చెల్లించేందుకు ఏపీ టిడ్కో ప్రతిపాదించింది. దీనిని ఆమోదిస్తూ 2025 నుంచి 2030 వరకు ఐదు వాయిదాల్లో చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ భూమిని అభివృద్ధి చేసిన అనంతరం అందులో ప్రధానమంత్రి ఆవాస యోజన అర్బన్-2.0 పథకం కింద 'ఎన్టీఆర్ నగర్' పేరుతో గృహ సముదాయాలను నిర్మించనున్నారు. ఈ భూమిలో ఉన్న కాలువలు, వంకలు, చెరువులు తదితర సహజ వనరులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అవి యథాతథంగా ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం షరతు విధించింది. నిబంధనలను ఉల్లంఘిస్తే వెంటనే భూమిని స్వాధీనం చేసుకునేందుకు కలెక్టరుకు అధికారం కల్పిస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

నిపుణుల జ్ఞానం విలువైనది : వీసీ



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నిపుణులు అందించే జ్ఞానాన్ని ఆకలింపు చేసుకోవాలని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ అన్నారు. బుధవారం ఐక్యూఏసీ ఆధ్వర్యంలో బీడీ బయోసైన్స్ ఇండియా సహకారంతో ఫ్లో సైటోమెట్రీ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ అనే అంశంపై ఒకరోజు సదస్సు జరిగింది. వీసీ ఆచార్య రాజశేఖర్ సదస్సును ప్రారంభించి నిపుణులను అభినందించారు. బీడీ బయోసైన్స్ సంస్థ సీనియర్ అప్లికేషన్ స్పెషలిస్ట్ కె.కరుణకు మార్ ఫ్లో సైటోమెట్రీ సాంకేతికత, దాని అనువర్తనాలపై ఉపన్యసించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, పరిశోధకులు ఇమ్యునాలజీ, క్యాన్సర్ బయాలజీ, సూక్ష్మజీ వుల గుర్తింపు వంటి రంగాల్లో ఫ్లోసైటోమెట్రీ వినియోగంపై అవగా హన కల్పించారు. జనెటిక్స్ అండ్ జినోమిక్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.దక్షాయణి, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ ఎల్.సుబ్ర మణ్యశర్మ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ : పీజీ విద్యార్థుల వసతి గృహాలను వీసీ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార పదార్థాల రుచి, నిర్వహణపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసి మందు లు, ఇతర అవసరాలను ఆరాతీశారు. వీసీ వెంట ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ ఉన్నారు.

పంట నమోదు త్వరగా పూర్తి చేయాలి



రైతులతో మాట్లాడుతున్న జేడీ చంద్రానాయక్

వేముల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పంట నమోదు, ల్యాండ్ పార్సిల్స్ ఈనెల 20వ తేదీ లోపు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రా నాయక్ రైతు సేవా సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండలంలోని చాగలేరు, పెద్దజూటూరు రైతు సేవా కేంద్రాలను ఆయన అకస్మిక తనిఖీ చేశారు. రైతు సేవా సిబ్బంది, రైతులతో రబీ సీజన్, ప్రస్తుత పంటల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరలో శనగ విత్తనాలు పంపిణీ ఉంటుందన్నారు. ఏఓ ఓబులేసు, మాజీ సర్పంచు బొగ్గుల భాస్క ర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పీలేరులో ప్రైవేటు ఆసుపత్రి సీజ్



ఆసుపత్రిని సీజ్ చేస్తున్న వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పోలీసు అధికారులు

పీలేరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ అనుమతి లేకుండానే నిర్వహిస్తున్నారంటూ పీలేరులోని అశ్విని హాస్పిటల్‌ను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు సీజ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి లక్ష్మీనరసయ్య, డెమో అధికారిణి దేవశిరోమణి మాట్లాడుతూ పీలేరులోని అశ్విని హాస్పిటల్ వారు ప్రభుత్వ అనుమతుల కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో దరఖాస్తు చేసుకున్నారని, మార్చిలో వారి దరఖాస్తు తిరస్కరణకు గురైందన్నారు. అనుమతులు లేకుండా ఆసుపత్రి నిర్వహించరాదని తెలిసినా వారు పట్టించుకోలేదని, స్పందన కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదు మేరకు తాము పరిశీలించి ఆసుపత్రిని సీజ్ చేశామన్నారు. ఆసుపత్రి నిర్వాహకులు పూర్తి అనుమతులు తీసుకున్న తరువాత ఆసుపత్రిని మరలా నిర్వహించుకోవచ్చునని స్పష్టం చేశారు. అయితే తమ దరఖాస్తు తిరస్కరణకు గురైన తరువాత జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో సంబంధిత అధికారులు సెలవులో ఉండడంతో తాము ముందుకు వెళ్లలేకపోయామని, మాకు సమయం ఇస్తే అన్ని అనుమతులు తీసుకుంటామని ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ శ్రమంత్ కుమార్‌రెడ్డి అధికారులను కోరారు. కాగా కేవలం అగ్నిమాపక శాఖ అనుమతులు లేని కారణంగా అశ్విని ఆసుపత్రిని సీజ్ చేయడం తగదంటూ వైసీపీ విద్యార్థి విభాగం, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు వైద్య ఆరోగ్య శాఖాధికారులు ముందు ఆందోళన చేపట్టారు. వైద్య సదుపాయాల పరంగా ఎటువంటి ఫిర్యాదులు లేకపోయినా, ఆసుపత్రి నిర్వాహకులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా సీజ్ చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఇటీవల బాలిక కాన్పు వ్యవహారం జరిగిన మాధవి ఆసుపత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, తొలుత ఆ ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మాధవి ఆసుపత్రిలో రికార్డుల పరిశీలన

మల్లెల గ్రౌండ్స్‌లోని మాధవి ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లక్ష్మీనరసయ్య, డెమో అధికారిణి దేవశిరోమణి, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రసాద్ నాయక్ బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వాహకురాలైన డాక్టర్ మాధవి ప్రస్తుతం అందుబాటులో లేరని, అయితే ఆసుపత్రిలో రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయని పరిశీలన అనంతరం అధికారులు వివరించారు.

చదువుతోపాటు క్రీడలపట్ల ఆసక్తి చూపాలి



గెలుపొందిన విద్యార్థులతో శ్రీచైతన్య యాజమాన్యం

సీకేదిన్నె, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపట్ల ఆసక్తి చూపాలని శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం రమణయ్య తెలిపారు. స్థానిక శ్రీచైతన్య స్కూలు బృందావనం క్యాంపస్‌లో బీఎస్‌రావు మెమోరియల్ స్పోర్ట్స్‌డే సెలబ్రేషన్స్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే చదువులో బాగా రాణిస్తారన్నారు. విద్యార్థులు చదువును, క్రీడలను సమానంగా ఆదరించి జీవితంలో ఉన్నతస్థితికి చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా త్రోబాల్, వాలీబాల్, ఖోఖో, క్రికెట్, అథ్లెటిక్స్‌లో విద్యార్థులకు కడప జోన్ లెవెల్‌లో పోటీలు నిర్వహించారు. అంతేకాక సాంస్కృతిక విభాగంలో కూడా పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ భాస్కర్, ప్రిన్సిపాల్ కిరణ్మయి, సాయికృష్ణ, ఇన్‌చార్జి చంద్రబాబు, మారుతి, పీఈటీ బృందం, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలసదనాల్లో ఉద్యోగావకాశాలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహిళాభి వృద్ధి, శిశు సంక్షమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనాల్లో వివిధ ఉద్యోగాలకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధి కారత అధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలపారు. పోస్టుల వివరాలు, అర్హత, నిర్ణయ ప్రమాణాలు, దరఖాస్తు ఫారాలను హెచ్‌టీపీపీఎస్/ కడప.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి పొందాలని తెలిపారు. అర్హతలున్న అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత ధృవీకరణ పత్రాలు జతప రిచి ఈ నెల 27న సాయంత్రం 5గంటల్లోపు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికా రత అధికారి కార్యాయం డీబ్లాక్, కొత్త కలెక్టరేట్, కడపలో సమర్పిం చాలన్నా రు. అర్హత ప్రమాణాలను అనుసరించి కుదించబడిన జాబితాలోని అభ్యర్థుల ను మాత్రమే ఇంటర్వ్యూలకు పిలవనున్నట్లు తెలిపారు. అలాగే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న బాలల పరిరక్షణ విభాగం, ప్రత్యేక దత్తత సంస్థ (శిశు గృహ)లో ఖాళీగా ఉన్న పలు పోస్టులకు కాంట్రా క్టు పద్ధతిన భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దర ఖాస్తులను ఈనెల 27న తమ కార్యాలయానికి అందించాలని పి.రమాదేవి వివరించారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించండి



మాట్లాడుతున్న ఐసీడీఎస్‌పీడీ రమాదేవి

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ పీడీ రమాదేవి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి పోషణ కార్యక్ర మంలో ఆమె మాట్లాడారు. వాటర్, శానిటేషన్, హైజీన్‌పైన అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, సీడీపీవోలతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. చేతుల పరిశుభ్రతలో భాగంగా 7 స్టెప్స్ ద్వారా చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలో తెలిపారు. భోజనానికి ముందు తరువాత, మల విసర్జన తరువాత చేతులు శుభ్రపరచుకోవడం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో 13 ప్రాజెక్టుల సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'గూగుల్'తో మారనున్న రాష్ట్ర ముఖచిత్రం

కలికిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గూగుల్ రాకతో నవ్యాంధ్ర ముఖ చిత్రమే మారనుందని రాష్ట్ర జంగమ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ అధ్యక్షుడు వాసునూరి చంద్రశేఖర్ అభివర్ణించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏడాదిగా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ పట్టుబట్టి ప్రయత్నిస్తే ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ప్రధాన చర్చనీయాంశమైందన్నారు. లక్షా 33 వేల కోట్ల రూపాయల పెట్టుబడులతో దాదాపు 1.80 లక్షల మంది యువతకు ఉద్యోగావకాశాలు చేరువయ్యాయన్నారు. ఇక మన యువత బయటి రాష్ట్రాలకు పోనవసరం లేకుండా ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నట్లు వివరించారు. 30 ఏళ్ల కిందట సీఎం చంద్రబాబు హైదరాబాదుకు రప్పించిన మైక్రోసాఫ్ట్ ఆ రాష్ట్రం దశదిశలను మార్చడం కళ్లారా చూస్తున్నామని, ఐదేళ్లలోనే గూగుల్ ప్రభావం రాష్ట్ర పురోగతిపై రాచమార్గం వేస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచం మొత్తం సిటీ ఆఫ్ డెస్టినీ అయిన విశాఖపట్నం వైపు చూడటం గర్వకారణమని చెప్పుకొచ్చారు. సబ్ సీ కేబుల్ (సముద్ర అంతర్భాగంలో వేసే కేబుల్ లైన్లు)తో ప్రపంచాన్ని అంతర్జాతీయ కనెక్టివిటీతో విశాఖ ముంగిటకు తేవడం ఖాయమన్నారు.

నకిలీ మద్యం సూత్ర, పాత్రధారి వైసీపీయే

● విలేకరుల సమావేశంలో టీడీపీ నేతలు



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ములకలచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు నకిలీ మద్యం తయారీ సూత్ర, పాత్రధారి వైసీపీనేనని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ ఆరోపించారు. ములకలచెరువులో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలోనే నకిలీ మద్యం తయారీ మూలాలు పడ్డాయన్నారు. ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూడలేక బురదచల్లేందుకు వైసీపీ మాజీ మంత్రి జోగి రమేష్ పథకం ప్రకారం జనార్ధన్‌రావు చేత ములకలచెరువులో నకిలీ మద్యం తయారు చేయించారన్నారు. నకిలీ మద్యం తయారీ కేంద్రంపై దాడులు చేయించి, పూర్తి విచారణ కోసం సిట్ ఏర్పాటు చేశారన్నారు. నకిలీ మద్యం తయారీలో ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు రావడంతో మా నేతలనే అధిష్టానం సస్పెండ్ చేసిందన్నారు. నకిలీ మద్యం మూలాలు వెలికితీయడంలో ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు చేస్తున్న నీచ రాజకీయాలను ప్రజలు నమ్మరన్నారు. మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, పార్లమెంటు మహిళా కార్యదర్శి గంగాదేవి, నేతలు మూగి రవిచంద్ర, చాంద్‌బాషా, రమణారెడ్డి, మౌలాసాహెబ్, గోపాల్‌రాజు, బుర్రా రమణ, బషీర్, నాయకులు భాస్కర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, రామదాసు పాల్గొన్నారు.

జీవన ఎరువుల వాడకం లాభదాయకం



జీవన ఎరువుల వాడకంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సోమశేఖర్‌బాబు

వాల్మీకిపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జీవన ఎరువుల వాడకం లాభదాయకమని కలికిరి కేవీకే శాస్త్రవేత్త సోమశేఖర్‌బాబు రైతులకు సూచించారు. బుధవారం బోయపల్లెలో కేవీకే సమన్వయ కర్త డాక్టర్ మంజుల ఆధ్వర్యంలో జీవన ఎరువుల వాడకంపై అవగాహన చేపట్టారు. జీవన ఎరువులైన రైజోబియంను వేరుశనగ, అలసంద, కంది, పెసర, మినుము లాంటి పంటల్లో కిలో విత్తనానికి 10మిల్లీ లీటర్లు కలిపి విత్తన శుద్ధి చేయవచ్చని సూచించారు. 500మిల్లీ లీటర్లు రైజోబియంను 200 కిలోల పశువుల ఎరువుతో కలిపి ఆఖరి దుక్కిలో ఎకరాకు వేయాలన్నారు. ఎకరాకు 16 నుంచి 20 కిలోల నత్రజని నేల లో స్థిరీకరిస్తుందని, అజొల్లా పెంచే విధానం, వరిలో వాడే విధానం రైతులతో చర్చించారు. జీవన ఎరువులు తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరి శోధన కేంద్రం, కలికిరి కృషి విజ్ఞాన కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వం గుర్తింపు పొందిన కంపెనీల నుంచి కొనుగోలు చేసుకోవచ్చన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ పీరుసాహెబ్, రైతులు పాల్గొన్నారు.

జీవన ఎరువులతో అధిక దిగుబడులు

పీలేరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జీవన ఎరువులతో అధిక దిగుబడులు సాధించవచ్చని కలికిరి కేవీకే కేంద్రం డైరెక్టర్ డాక్టర్ మంజుల తెలిపారు. జీవన ఎరువుల వాడకంపై వేపులబైలు పంచాయతీ మిట్టపల్లె రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ జీవన ఎరువులైన అజొల్లా, రైజోబియం, అజటోబాక్టర్, ఫాస్ఫేట్ సాల్యుబులైజింగ్ బ్యాక్టీరియాను వరి, అపరాలు, వేరుశనగ పంటల్లో సిఫారసు చేసిన పద్ధతుల్లో ఉపయోగించి మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి ● వైసీపీ హయాంలో పాలన నిర్వీర్యం

● పీలేరు, కలకడ మండల సమీక్షల్లో ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అధికారులు, నేతలు సమన్వయంతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, వైసీపీ పాలన నిర్వీర్యంపై ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. పీలేరు, కలకడ మండల కేంద్రాల్లో నిర్వహించిన మండల స్థాయి సమీక్షల్లో ఎమ్మెల్యే నాయకులకు పలు సూచనలు చేశారు. పీలేరు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సమీక్షలో ఆయన మాట్లాడుతూ నిత్యం తమ నేతలు, గ్రామ సమస్యలను అధికారుల దృష్టికి తెస్తుంటారని, క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలన్నారు. అధికారులు, నేతలు సమన్వయంతో పనిచేస్తే 90 శాతం సమస్యలు అక్కడే పరిష్కారమవుతాయన్నారు. సమస్యలు పరిష్కరించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని, కొన్ని చోట్ల అధికారులు తమను పట్టించుకోవడం లేదంటూ కొందరు నేతలు ఫిర్యాదు చేయడంతో ఎమ్మెల్యే అధికారులకు పలు సూచనలు చేశారు. నిధుల కేటాయింపు, ప్రభుత్వ విధానాలకు సంబంధించిన సమస్యలను తన దృష్టికి తెస్తే ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గంలో ఉద్యోగులపై రాజకీయ ఒత్తిళ్లు లేని ప్రశాంత వాతావరణం కల్పించామని, ఇక్కడ పనిచేయలేని అధికారులు మరెక్కడా పనిచేయలేరన్నారు. లక్ష్యాలకు అనుగుణంగా, స్థానిక పరిస్థితులను ఆకళింపు చేసుకుని పని చేయాలన్నారు. సమీక్షలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లో-ఓల్టేజ్, కొత్త స్తంభాల ఏర్పాటు, నూతన రోడ్ల నిర్మాణం, కొత్త నీటి బోర్ల ఏర్పాటు వంటి సమస్యలు వెలుగు చూశాయి. వాటన్నింటినీ స్థానిక సంస్థల నిధులతో పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి మండల సమీక్ష సమావేశాలు నిర్వహిస్తానన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు యల్లెల రెడ్డప్ప రెడ్డి, ట్రాన్స్‌కో ఈఈ చంద్రశేఖర రెడ్డి, హౌసింగ్ డీఈ రమణయ్య, తహసీల్దారు శివకుమార్, ఎంపీడీఓ శివశంకర్, ఏపీఎంలు జవహర్, అశోక్, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కోటపల్లె బాబు రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మీకర, రెడ్డిబాషా, అమరనాథరెడ్డి, శ్రీనాథ రెడ్డి, నరేశ్, కలపరవి, మోహన కృష్ణ, సుబ్బయ్య, ధనశేఖర్, గురుమోహన్, రాజేశ్, వెంకటరమణ పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులు, నేతలకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

కలకడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజా సమస్యలు పునరావృతం కాకుండా వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019-24 వైసీపీ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు సాక్ష్యమే రీ సర్వేలో జరిగిన అవకతవకలని ఆయన వివరించారు. ప్రస్తుతం పట్టాదారులు పడరానిపాట్లు పడుతున్నారని, ఈ సమస్యను సరిచేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించిందన్నారు. విషయమై అసెంబ్లీ వేదికగా రైతుల పక్షాన మాట్లాడినట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీ, విద్యుత్ ఇతర శాఖల అధికారులు, సిబ్బంది వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే ప్రజలను కాలయాపన చేస్తూ తిప్పుకోరాదన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్యకు తావులేకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామాల వారీ సమీక్షించారు. కార్యక్రమంలో తెలుగురైతు ఉపాధ్యక్షుడు మల్లారపు రవిప్రకాశ్ నాయుడు, నేతలు మద్దిపట్ల వెంకటరమణ నాయుడు, వంగిమళ్ల మధుసూదన్‌రెడ్డి, పొత్తూరి ప్రభాకర్ నాయుడు, అబ్బూరి తిరుపతి నాయుడు, దగ్గుపాటి వెంకటేశ్వరరావు, పీవీస్వామి, కాంతారావు, శేఖర్ నాయుడు, చంద్రమోహన్, త్యాగరాజు, దామోదర్ నాయుడు, రైస్‌మిల్ రమణ, వసంత నాయుడు, బాబు నాయుడు, పీవీ రమణ నాయుడు, రామానాయుడు, తారకేశ్వర, ప్రసాద్ నాయుడు, మల్లికార్జున్ నాయుడు, తహసీల్దార్ మహేశ్వరి బాయి, ఎంపీడీఓ భానుప్రసాద్, తదితర అధికారులు పాల్గొన్నారు.

తల్లీ బిడ్డల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



మదనపల్లెలో గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

మదనపల్లె టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తల్లీ బిడ్డల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించేలా అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, ఏసీడీపీఓ సునీత అన్నారు. బుధవారం ఐసీడీఎస్ కార్యాలయంలో రాష్ట్రీయ పోషకాహార మాసోత్సవంలో గర్భిణులకు సీమంతం చేశారు. అధికారులు మాట్లాడుతూ చిన్నారులకు దుకాణాల్లో విక్రయించే చిరుతిండ్లు తిని పించరాదన్నారు. పోర్డు డైరెక్టర్ లలితమ్మ మాట్లాడుతూ ఇంట్లో వండిన ఆహార పదార్థాలను మాత్రమే తినిపించాలన్నారు. అనంతరం పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు శ్వేత, కళావతి పాల్గొన్నారు.

రామసముద్రం అంగన్వాడీ కేంద్రంలో...

రామసముద్రం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఫేస్-3 అంగన్వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవం నిర్వహించారు. సూపర్‌వైజర్ రమాదేవి మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారంలో మాంసం కృత్తులు, గుడ్లు, ఆకుకూరలు, ఉండాలన్నారు. సజ్జలు, రాగులు, కొర్రలతో చేసిన పదార్థాలను వాడాలన్నారు. తక్కువ నూనె ఉపయోగించి ఎప్పటికప్పుడు ఇంట్లోనే తయారు చేసుకున్న వేడి ఆహార పదార్థాలను తినడం ఇంటిల్లి పాది అలవాటు చేసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రంలో కూరగాయలు, పండ్లు, గుడ్లు, స్థానిక ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు.

చెక్కర, నూనె వస్తువులు తగ్గించాలి

నిమ్మనపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చెక్కర, నూనె వస్తులు తగ్గిస్తే స్థూలకాయం తగ్గే అవకాశం ఉందని ఎంఈఓ-2 నారాయణ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలను సూపర్‌వైజర్ ధనలక్ష్మి, కుసుమ అధ్వర్యంలో నిర్వహించారు. బాల్యదశ నుంచి సంరక్షణ, విద్యపై దృష్టి సారించి, శిశు, చిన్నపిల్లల ఆహారపు అలవాట్లను గమనించి, చిరుధాన్యాలను అలవాటు చేయాలన్నారు. ఆకుకూరలు పండ్లు వంటివి తినాలన్నారు. ఏపీఓ రమేష్, కార్యదర్శి రాజశేఖర్‌నాయక్, ఎంసీఓ గుర్రప్ప పాల్గొన్నారు.

మెనూ మేరకు భోజనం....

తంబళ్లపల్లె, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చిన్నారులకు కేంద్రంలో మెనూ మేరకు భోజనం అందించాలని సీడీపీఓ సుజాత సూచించారు. తంబళ్లపల్లె-1,2, హరిజనవాడ, కాయలపల్లె అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. పిల్లల హాజరు, కేంద్రాల్లో ఉన్న స్టాకును పరిశీలించిన ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన పిల్లలు అందరూ హాజరయ్యేలా చొరవ తీసుకోవాలని సూచించారు. రిజిస్టర్లలో వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తుండాలని, అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు, స్టాకును శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. క్రమం తప్పకుండా పిల్లల ఎత్తు, బరువులు తీసి యాప్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట సూపర్‌వైజర్ చంద్రకాంత, అంగన్ వాడీ వర్కర్లు, హెల్పర్లు ఉన్నారు.

అధికారులతో నేడు ఎమ్మెల్యే సమీక్ష

కలికిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై గురువారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి సమీక్ష నిర్వహించనున్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ భానుమూర్తి రావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు తప్పక హాజరవాలని కోరారు. అధికారులు ఆయా శాఖల పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీఓ సూచించారు.

అలసత్వం చేస్తే చర్యలు



చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

నిమ్మనపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణలో అలసత్వం చేస్తే చర్యలు తప్పవని డీఎల్‌పీఓ నాగరాజ తెలిపారు. బుధవారం సామకోటవారిపల్లి పంచాయతీలో చెత్త సేకరణను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ అంబుడ్స్‌మెన్‌లు రోజూ ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తను సేకరించాలని, సేకరించిన చెత్తను సంపద కేంద్రాల్లో వేసి ఎరువును తయారు చేసి పంచాయతీకి ఆదాయం తేవాలన్నారు. చెత్త సేకరణలో సామకోటవారిపల్లి పంచాయతీ వెనుకంజలో వుందని వీలైనంత త్వరగా ముందంజలోకి వచ్చేందుకు సిబ్బంది శ్రమించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు, కార్యదర్శి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోస్టర్లు ఆవిష్కరణ

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చెకుముకి టాలెంట్ టెస్టు పోస్టర్లు బుధవారం హోప్ మున్సిపల్ హైస్కూల్‌లో జన విజ్ఞాన వేదిక సభ్యులు ఆవిష్కరించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు హరింద్రనాథ్ శర్మ మాట్లాడుతూ 30 ఏళ్లగా చెకుముఖి టాలెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవడానికి ఈ టాలెంట్ టెస్టు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ అవకాశాన్ని 8,9,10 తరగతుల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జేవీవీ, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు చంద్ర, ఉపాధ్యాయులు బెల్లం సుధాకర్, వాణి, జబ్బార్, జయరాం, షర్మిల, చిరంజీవి పాల్గొన్నారు.

భార్య,భర్తపై దాడి

మదనపల్లె అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భార్య, భర్తపై దాడి చేసినట్లు ఆస్పత్రి అవుట్ పోస్టుపోలీసులు తెలిపారు. చౌడేపల్లె మండలం, బోయకొండలో చోటుచేసుకున్న సంఘటన వివరాల్లోకెళితే... బోయకొండ, ఆర్‌ఆర్ కాలనీ వాసులు గంగులప్ప, అతని భార్య గంగాదేవి కూలీ పనులు చేస్తూ జీవిస్తున్నారు. కాగా తన భార్య గంగాదేవిని వెంకటరమణ ఇబ్బంది పెడుతున్నాడని అడిగినందుకు బుధవారం ఉదయం అదే కాలనీకి చెందిన వెంకటరమణ, మల్లికార్జున, రుక్మిణమ్మ దాడి చేసి గాయపర్చినట్లు బాధితులు తెలిపారు. చౌడేపల్లె పోలీసులు కేసు విచారిస్తున్నట్లు వివరించారు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో దాడి చేసిన కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. మంగళవారం చిప్పిలి సమీపంలో భూమి ఆక్రమించాడనే నెపంతో వ్యాపారి కోటకొండ మోహన్ మురళిపై మదనపల్లె మున్సిపల్ మాజీ చైర్మన్ కొడవలి శివప్రసాద్, అతని డ్రైవర్ వేంకటేశ్ దాడి చేశారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు విచారించి బుధవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయండి

పీలేరు రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ మండల కేంద్రాల్లో 17న తలపెట్టిన నిరసన, ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి గండికోట వెంకటేష్ పిలుపు నిచ్చారు. న్యాయమూర్తిపై దాడికి పాల్పడడం ఆటవిక చర్యగా అభివర్ణిస్తూ లాయర్ ప్రశాంత్ కిషోర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇరువర్గాల దాడి - నలుగురికి గాయాలు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంటి విషయమై ఇరువర్గాలు దాడి చేసుకోవడంతో ఖాదర్‌వల్లి, ఖలీల్, రజియా, హసీనా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. ములకలచెరువు మండలం పాతకోటలో చోటు సంఘటన వివరాల్లోకెళితే... ఇంటి ముందున్న కారును పక్కన పెట్టమన్నందుకు ఖాదర్‌వల్లి, ఖలీల్, రజియా, హసీనాపై అదే గ్రామానికి చెందిన వక్రుద్దీన్, నజీర్, హుసేన్, బీబీలు కర్రలతోదాడి చేసి గాయపర్చారు. క్షతగాత్రులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందారు. గతంలో కూడా పలుమార్లు దాడి చేసినట్లు అప్పట్లో పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా కలాం జయంతి

వాల్మీకిపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి మిస్సైల్ మ్యాన్ దివంగత ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను బుధవారం వాల్మీకిపురంలో ఘనంగా చేసుకున్నారు. స్థానిక ఉర్దూ హైస్కూల్‌లో కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ 1969లో ఇస్రోలో చేరి భారతదేశపు మొట్టమొదటి ఉపగ్రహ వాహన ప్రయోగంలో కీలక పాత్ర పోషించారన్నారు. పృథ్వి, అగ్ని వంటి క్షిపణులు అభివృద్ధికి కృషి చేసినందుకు అబ్దుల్‌కలాంను మిస్సైల్ మ్యాన్ అని పిలుస్తారని, భారతదేశానికి ఆయన అందించిన ఎనలేని సేవలను విద్యార్థులకు తెలియజేశారు. హెచ్‌ఎం వెంకటరమణ నాయక్, మైనార్టీ నేతలు షబ్బీర్, షాహీద్, అషర్, ఇర్ఫాన్, ఫయాజ్, ఇమ్రాన్, రఫి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో కాంగ్రెస్ పార్టీ నేతలు ...

గుర్రంకొండ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను గుర్రంకొండలో కాంగ్రెస్ పార్టీ నేతలు నిర్వహించారు. కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమీరుద్దీన్, హైదయతుల్లా, గౌస్‌బాష, ఖాజా, జాకీర్, ఇషాక్ అలీ పాల్గొన్నారు.

వాకర్స్ ప్రాంగణంలో...



కలాంకు నివాళులర్పిస్తున్న యువకులు

బి.కొత్తకోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్‌గా పేరొందిన భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని బి.కొత్తకోటలో ఘనంగా చేసుకున్నారు. రంగసముద్రం రోడ్డులోని వాకర్స్ ప్రాంగణలో క్రిష్టారెడ్డి, బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు, బెంగళూర్ రోడ్డు యూత్ ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి నివాళులర్పించారు.

మహిళల ఆరోగ్యం కోసమే పోషణ మాసోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ భాగ్యమ్మ

బి.కొత్తకోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు, శిశువుల ఆరోగ్య సంరక్షణ కోసమే పోషణ మాసోత్సవాలను ఐసీడీఎస్ నిర్వహిస్తోందని సీడీపీఓ భాగ్యమ్మ అన్నారు. ములకలచెరువు, పీటీఎం, బి.కొత్తకోట మండలాల అంగన్వాడీ కార్యకర్తలతో పోషణ మాసోత్సవం నిర్వహించారు. పౌష్టికా హారాన్ని ప్రదర్శనకు ఉంచారు. తమ కేంద్రాల పరిధిలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు ఆరోగ్యంగా ఉండటానికి అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు జయరాణి, గౌరీదేవి, నాగరత్న, భవాని, ప్యారీ, రామలక్ష్మమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు పోలీస్ కారు కటౌట్

ముదివేడు పోలీసుల వినూత్న ఆలోచన



పోలీస్‌కారు కటౌట్ వద్ద వివరాలను తెలియజేస్తున్న డీఎస్పీ మహేంద్ర

కురబలకోట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చెన్నామర్రి మిట్ట తరచూ ప్రమాదాలు జరిగే రహదారిపై ప్రమాదాల నివారణకు ముదివేడు పోలీసులు వినూత్న ఆలోచనతో ఏర్పాటు చేసిన కటౌట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చెన్నామర్రి మిట్ట వద్ద ఇటీవల జరిగిన ప్రమాదంతో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. దీంతో ఆ ప్రాంతంలో ప్రమాదాల నివారణకు పోలీసులు ట్రాఫిక్ కానిస్టేబుల్, పోలీసు వాహనం కటౌట్‌ను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాన్ని బుధవారం పరిశీలించిన డీఎస్పీ మహేంద్ర మాట్లాడుతూ మదనపల్లె డివిజన్ పరిధిలో ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ పోలీసులు ట్రాఫిక్ కానిస్టేబుల్, పోలీసు వాహనం కటౌట్‌లను చేయనున్నట్లు పేర్కొన్నారు. కటౌట్‌లను ఏర్పాటు చేయడం వలన పోలీసులు ఉన్నారని భావించి వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలకు లోబడి నడుపుతారన్నారు. మైనర్లు, యువత వాహనాలను అతి వేగంగా నడపరాదన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ దిలీప్‌కుమార్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేతుల శుభ్రత ఆరోగ్యానికి భద్రత

వాల్మీకిపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చేతుల శుభ్రతే ఆరోగ్యానికి భద్రత అని మండల డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహ్మద్‌రఫీ అన్నారు. చింతపర్తి హైస్కూల్‌లో ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. చేతుల శుభ్రత పాటించే చిన్న అలవాటు మనకు, మన కుటుంబానికి రక్షణ అన్నారు. శుభ్రతే ఆరోగ్యం, ఆరోగ్యమే ఆనందం విషయాలను గ్రహించి గ్రామీణ ప్రాంత విద్యార్థులు తమ కుటుంబీకులకు కూడా శుభ్రత ప్రాముఖ్యతను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం మునిరాజ, సీహెచ్‌ఓ అరుణ, సూపర్‌వైజర్ భానుబీ, వైద్య సిబ్బంది హృదయాశ్వరి, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లాభాల సాగు...

- అంతరపంటలతో చీడపీడల నివారణ
- దిగుబడి అధికం


పత్తిలో కందిపంట సాగు


మిరపలో అంతరపంటగా గుండుమల్లె సాగు


మొక్కజొన్నలో మగమొక్కజొన్న

రాజుపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్, రబీలో సాగు చేస్తున్న కంది, మినుము, మిరప, మొక్కజొన్న, పసుపు తదితర పంటల్లో అంతర పంటలు సాగు చేయడం ద్వారా చీడపీడల నివారణతో పాటు రైతన్నలకు మంచి లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయాధికా రులు సూచిస్తున్నారు. పత్తి పంటలో రెండుసాళ్లకు ఒకసాలు కంది సాగు చేయడం ద్వారా పచ్చపురుగుతో పాటు చీడపీడలు ఎక్కువగా సోకకుండా నివారించవచ్చు. పురుగులు ఎక్కువగా కందిపంటపైనే ఉండడంతో మందు పిచికారి చేయడం ద్వారా రెండు పంటలను రక్షించుకోవచ్చన్నారు. అలాగే మిరపలో బంతిపూల చెట్లు నాటడం ద్వారా తెగుళ్లను, బంతిపూలను పురుగు ఆశించడం ద్వారా మందు ప్రభావంతో నివారించడంతో పాటు దిగుబడి పెంచుకునేందుకు వీలుంటుందన్నారు. అదే విధంగా మొక్కజొన్నలో అంతరపంటగా మగ మొక్కజొన్నలు నాటడం ద్వారా కమర్షియల్ పంటకు క్వింటాకు రూ.2వేలు పలికితే సీడ్ మొక్కజొన్నకు క్వింటా రూ.6వేలు పలుకుతోంది. ఇది రైతులకు మంచి లాభదాయకమన్నారు. ఈ విధంగా పంటలు వేసుకోవడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోవడంతో పాటు రెండు దిగుబడులు పొంది రైతన్నలు లాభాలు పొందవచ్చని వ్యవసాధికారులు సూచిస్తున్నారు.

సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు

- మదనపల్లె ఎక్సైజ్ సీఐ భీమలింగ


మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ భీమలింగ

మదనపల్లె టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణ నిర్వాహకులు సమయ పాలన పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ భీమలింగ హెచ్చరించారు. బుధవారం ఎక్సైజ్ స్టేషన్‌లో మద్యం దుకాణాల యజమానులు, నౌకరునామాదారుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ కొన్ని మద్యం దుకాణాలు, బార్లు సమయపాలన పాటించడంలేదని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి, నిబంధనలు పాటించని దుకాణాలపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎక్సైజ్ సురక్ష యాప్‌ను నౌకరునామాలు డౌన్‌లోడ్ చేసుకుని విక్రయించే ప్రతి మద్యం బాటిల్‌ను స్కాన్ చేసి వినియోగదారుడికి అందజేయాలన్నారు. అనంతరం పట్టణంలో పలు మద్యం దుకాణాలను తనిఖీ చేసి పలు బాటిళ్లను క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు జబీవుల్లా, డోర్కాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌లో సూపర్‌జీఎస్టీ పై ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీ టూరిజం మేనేజర్ కొల్లి శ్రీధర్, సిబ్బంది

బి.కొత్తకోట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్‌లో ఏపీ టూరిజం సిబ్బంది సూపర్ జీఎస్టీపై బుధవారం అవగాహన చేపట్టారు. హార్సిలీహిల్స్ యూనిట్ మేనేజర్ కొల్లిశ్రీధర్ ఆధ్వర్యంలో సిబ్బంది బ్యానర్లు చేతపట్టి హిల్స్ రోడ్లపై ర్యాలీ నిర్వహించారు. టూరిజం మేనేజర్ మాట్లాడుతూ మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం సూపర్ జీఎస్టీ ద్వారా ప్రజలకు చాలా వెసులుబాటు కల్పించిందన్నారు.కార్యక్రమంలో టూరిజం సిబ్బందితో పాటు స్థానికులు పాల్గొన్నారు.

పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు

మైలవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా సంజాముల మండలం నొస్సం మహిళ తన ముగ్గురు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిం చింది. కుటుంబ సమస్యల కారణంగా పిల్లలను తీసుకుని ఆత్మహత్య చేసుకోవడానికి బుధవారం మైలవరం జలాశయం వద్దకు రాగా స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన పోలీసులు వారిని కాపాడారు. పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా... జమ్మలమడుగులోని భాగ్యనగర్ కాలనీకి చెందిన మహిళను నొస్సం గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. కుటుంబ సమస్యల కారణంగా ఇద్దరు కూతుర్లు, కుమారుడితో జమ్మలమడుగుకు వచ్చి అక్కడి నుంచి ఆటోలో మైలవరం జలాశయం వద్దకు చేరుకుని జలాశయం గేట్ల వద్ద ఆత్మహత్య చేసుకోవడానికి చూస్తుండగా గమనించిన ఓ ఆటో డ్రైవర్ మైలవరం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు చేరుకుని, ఆమెతో పాటు పిల్లలను స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులను పిలిపించి అప్పగించినట్లు ఏఎస్ఐ లక్ష్మిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రమణారెడ్డి, కానిస్టేబుల్ రియాజ్‌లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నిమ్మనపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన హరీష్ (25) తిరుపతిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లి వడ్డిపల్లికి చెందిన వెంకటరమణ కుమారుడు హరీష్ బెంగళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తుండేవాడు. అయితే అతను మదన పల్లిలో సొంతంగా బ్యాటరీ దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు తల్లిదండ్రులను అడిగాడు. దీనికి వారు వద్దని చెప్పడంతో మన స్థాపం చెంది ఈనెల 5వ తేదీ ఇంట్లో వున్న విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి తరలించగా, రుయా ఆస్పత్రిలో చికిత్స బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో ఫీల్డ్ అసిస్టెంటు...

గోపవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాచాయిపేట పంచాయతీలో ఉపాధి ఫీల్డ్ అసిస్టెంటు వేముల వెంకటేశ్వర్లు (40) అనారోగ్యానికి గురై నెల్లూరులో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల మేరకు... వెంకటేశ్వర్లు నాలుగు రోజుల కిందట విధి నిర్వహణలో ఉండగా పక్షవాతం వచ్చింది. వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు.

జాక్‌పాట్ విధానం రద్దు చేయించండి

- కమిటీ చైర్మన్‌కు రైతుల ఫిర్యాదు

మదనపల్లె టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మదనపల్లె మార్కెట్‌యార్డులో టమోటా వేలంలో జాక్‌పాట్ విధానంతో వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారని, ఈ విధానాన్ని రద్దు చేయాలని పలువురు రైతులు మార్కెట్ కమిటీ చైర్మన్ శివరామ్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం కొత్త కమిటీ డైరెక్టర్లతో కలిసి చైర్మన్ మార్కెట్‌లో పరిశీలించారు. రైతులు మాట్లాడుతూ మదనపల్లె మార్కెట్‌లో వ్యాపారులు వారికి తోచిన ధరలతో టమోట కొనుగోలు చేస్తున్నారని, ఒక్కో మండీలో ఒక్కో ధర ఇస్తూ రైతులను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అదేమంటే టమోటా నాణ్యత లేదని సాకులు చెబుతున్నారన్నారు. జాక్‌పాట్ విధానంతో 10 క్రేట్లకు 10 క్రేట్లు తీసివేసి మిగిలిన వాటికి డబ్బు ఇస్తున్నారన్నారు. దీనిపై చైర్మన్ మాట్లాడుతూ త్వరలో రైతులు, ట్రేడర్స్‌తో సమావేశం ఏర్పాటు చేసి, మార్కెట్‌లో సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. డైరెక్టర్లు మున్నా నాయక్, శ్యామలమ్మ, సంధ్యారాణి, మండీ యజమానులు అక్కులరెడ్డి, వీరభద్రారెడ్డి, సనావుల్లా పాల్గొన్నారు.

బాలబాలికల జిల్లా జట్లు ఎంపిక

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో 17, 18న స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక జరగనుందని గేమ్స్ కార్యదర్శి డాక్టర్ బాబు, నాగరాజ తెలిపారు. 17న ఉదయం రెజ్లింగ్, గ్రీకో రోమన్ విభాగాల్లో అండర్ 17,19 బాలబాలికలకు ఎంపిక గుడిపాల మండలం నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించనున్నారు. అదే రోజు గుడిపాల మండలం, తుమ్మింద జెడ్పీ హైస్కూల్‌లో ఉదయం అండర్ 14,17,19 సైక్లింగ్ పోటీలు, మధ్యాహ్నం చిత్తూరులోని తానా, విజయం కళాశాలలో అండర్ 17,19 బాల బాలికలకు మోడరన్ పెంటా తలాన్ జిల్లా జట్ల ఎంపిక, 18న సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్నం అండర్ 14 బాల బాలికల బాస్కెట్‌బాల్, అండర్ 19 రగ్బీ ఎంపిక జరుగుతుందన్నారు. 17న కురబలకోట మండలం, అంగళ్లు జడ్పీ హైస్కూల్‌లో అండర్ 17 వాలీబాల్ ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎంపిక జరుగుతుందన్నారు. నిమ్మనపల్లె మండలం, రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్‌లో అండర్ 19 బాల బాలికల కబడ్డీ జట్టు ఎంపిక ఉదయం జరుగుతుందన్నారు.

ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌ను సందర్శించిన డీఆర్‌ఎం


ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో సూచనలు చేస్తున్న డీఆర్‌ఎం

ఎర్రగుంట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌ను బుధవారం గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ సీఎస్ గుప్తా సందర్శించారు. స్టేషన్‌లో పరిశుభ్రతపై ఆరా తీశారు. అన్ని గదులను, రైల్వే ప్లాట్‌ఫారాలను, రైల్వే ఇంజిన్ డ్రైవర్స్ రెస్ట్ రూంను ఆయన పరిశీలించారు. స్టేషన్‌లో జరుగుతున్న పలు పనులపై ఆయన ఆరా తీసి పలు సూచనలు చేశారు. అనంతరం ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ చుట్టూ ఉన్న సిమెంట్ పరిశ్రమల యాజమాన్య హెచ్‌ఓడీలతో ఆయన ఎర్రగుంట్లలోని అల్ట్రాటెక్ సిమెంట్ పరిశ్రమలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైల్వే నుంచి రవాణా విషయంలో పరిశ్రమలకు గల సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా లోడింగ్ మరింత పెంచి రైల్వేల అభివృద్ధికి పూర్తి సహకారాలు అందించాలని కోరారు. అయితే సైడింగ్స్‌లో ఉన్న సమస్యలపై పరిశ్రమల వారు డీఆర్‌ఎంకు వివరించారు. అలాగే స్పీడ్ పెంచాలని కోరారు. ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ నుంచి అల్ట్రాటెక్ పరిశ్రమకు వెళుతున్న సైడింగ్‌ను మరింత అభివృద్ధి చేయాలన్నారు.

యూజీడీ నిర్మించాలని వినతి

ఎర్రగుంట్ల నుంచి జువారి కర్మాగానికి వెళుతున్న రైల్వేట్రాక్ ఎర్రగుడిపాడు రస్తా వద్ద రైల్వే అండర్ గ్రౌండ్ బ్రిడ్జిని నిర్మించాలని ఏఎంసీ చైర్మన్ నాగరాజు, కత్తి ప్రతాప్‌రెడ్డి తదితరులు డీఆర్‌ఎంకు వినతి పత్రం ఇచ్చారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న దృష్ట్యా వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సీనియర్ డివిజనల్ అధికారులు, స్థానిక అధికారులు డీఆర్‌ఎం వెంట ఉన్నారు.

రాయచోటిలో 50 ఎకరాల్లో టిడ్కో ఇళ్లు

- శిబ్యాల పరిధిలోని భూమి అప్పగింతకు ఆదేశాలు
- ఎన్టీఆర్‌నగర్ పేరుతో ఇళ్ల సముదాయం

కలికిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మున్సిపాలిటీ పరిధిలో టిడ్కో ఇళ్లు నిర్మించడానికి ప్రభుత్వం సన్నాహాలు మొదలు పెట్టింది. పట్టణ శివారులో టిడ్కో ఇళ్ల నిర్మాణం కోసం 50 ఎకరాలను వెంటనే ఏపీ టిడ్కో మేనేజింగ్ డైరెక్టరు పేరుతో బదలాయించాల్సిందిగా కలెక్టరును ఆదేశిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాయచోటి శివారు శిబ్యాల గ్రామంలోని 50 ఎకరాలకు రూ.1.34 కోట్ల ధర నిర్ణయించింది. టిడ్కో ఇళ్ల నిర్మాణం కోసం జూలై 16న కలెక్టరు పంపిన ప్రతిపాదనలను ప్రభుత్వం ఆమోదించి ఏపీ టిడ్కోకు కేటాయించింది. శిబ్యాల గ్రామ సర్వే నం.2215లో 13 ఎకరాలు, 2216లో 19 ఎకరాలు, 2217లో 18 ఎకరాలు కలిపి మొత్తం 50 ఎకరాల ప్రభుత్వ భూమికి రూ.1.34 కోట్లు ఏపీ టిడ్కో ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. అయితే ముందస్తుగా భూమిని అప్పగిస్తే అందులో రోడ్లు, ఇతరత్రా అభివృద్ధిని చేపట్టిన అనంతరం వచ్చే రాబడిని అనుసరించి చెల్లించేందుకు ఏపీ టిడ్కో ప్రతిపాదించింది. దీనిని ఆమోదిస్తూ 2025 నుంచి 2030 వరకు ఐదు వాయిదాల్లో చెల్లించడానికి ప్రభుత్వం అంగీకరించింది. ఈ భూమిని అభివృద్ధి చేసిన అనంతరం అందులో ప్రధానమంత్రి ఆవాస యోజన అర్బన్-2.0 పథకం కింద 'ఎన్టీఆర్ నగర్' పేరుతో గృహ సముదాయాలను నిర్మించనున్నారు. ఈ భూమిలో ఉన్న కాలువలు, వంకలు, చెరువులు తదితర సహజ వనరులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా అవి యథాతథంగా ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వం షరతు విధించింది. నిబంధనలను ఉల్లంఘిస్తే వెంటనే భూమిని స్వాధీనం చేసుకునేందుకు కలెక్టరుకు అధికారం కల్పిస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

సీపీఆర్ విధానం నేర్చుకోవాలి

పీలేరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రాణానికి భరోసానిచ్చే సీపీఆర్(కార్డియో పల్మనరీ రీససిటేషన్) విధానాన్ని నేర్చుకోవాలని తలపుల పీహెచ్‌సీ హెచ్‌ఈ కొండయ్య ఐటీఐ విద్యార్థులకు సూచించారు. ఐటీఐలో బుధవారం విద్యార్థులకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించిన ఆయన మాట్లాడుతూ కరెంటు షాక్, నీటిలో మునగడం లాంటి సంఘటనలతో గుండె పనితీరు ఆగినప్పుడు సీపీఆర్ చేయడం అత్యవసరమన్నారు. అనంతరం బాధితులకు సీపీఆర్ చేసే విధానాన్ని చేసి చూపించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది మునిస్వామి, ఆదినారాయణ, ప్రమీల, కృష్ణమ్మ, లావణ్య, పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేశాకే మద్యం అమ్మాలి

- ములకలచెరువు ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్

ములకలచెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ సురక్షా యాప్ ద్వారా క్యూఆర్‌కోడ్ స్కానింగ్ చేశాకే మద్యం అమ్మాలని ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ అన్నారు. ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమడ్యం మద్యం దుకాణ లైసెన్సు దారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మద్యం దుకాణంలో డైలీ లిక్కర్ వెరిఫికేషన్ రిజిస్టర్‌ను అమలు చేయాలన్నారు. మద్యం దుకాణాల్లో నకిలీ మద్యం ఉంటే లైసెన్సులు రద్దు చేసి సీజ్ చేస్తామన్నారు. బెల్ట్‌షాపులకు మద్యం ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఐ వెంకటేష్, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనాథరెడ్డి, నాగరాజు, సిబ్బంది మహేష్, భాస్కర, చందు పాల్గొన్నారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

పీలేరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చిన్నారి మృతికి కారణమైన మదనపల్లె అభ్యుదయ పాఠశాల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృత తేజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలపై చర్యలు తీసుకోవడమే కాక చిన్నారి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ బుధవారం ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. విద్యార్థుల భద్రతను కాపాడాల్సిన ప్రైవేటు విద్యాసంస్థలు లాభార్జనే ధ్యేయంగా పనిచేస్తున్నాయన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయి సంపత్, లోకేశ్, ఇమ్రాన్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

'రాష్ట్రానికి ద్రోహం చేసిన మోదీ గో బ్యాక్'

మదనపల్లెఅర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ద్రోహం చేసిన ప్రధనమంత్రి మోదీ గో బ్యాక్ అంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానిమోదీ జీఎస్టీ సుంకాల తగ్గింపు గురించి మాట్లాడేందుకు 16న కర్నూల్ వస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో నాలుగుసార్లు రాష్ట్రానికి వచ్చారని, ఊకదంపుడు ఉపన్యాసం తప్ప ప్రజలకు చేసిన మేలేమి చేశారని ప్రశ్నించారు.

పీలేరులో ప్రైవేటు ఆసుపత్రి సీజ్


ఆసుపత్రిని సీజ్ చేస్తున్న వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పోలీసు అధికారులు

పీలేరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక శాఖ అనుమతి లేకుండానే నిర్వహిస్తున్నారంటూ పీలేరులోని అశ్విని హాస్పిటల్‌ను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు సీజ్ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి లక్ష్మీనరసయ్య, డెమో అధికారిణి దేవశిరోమణి మాట్లాడుతూ పీలేరులోని అశ్విని హాస్పిటల్ వారు ప్రభుత్వ అనుమతుల కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో దరఖాస్తు చేసుకున్నారని, మార్చిలో వారి దరఖాస్తు తిరస్కరణకు గురైందన్నారు. అనుమతులు లేకుండా ఆసుపత్రి నిర్వహించరాదని తెలిసినా వారు పట్టించుకోలేదని, స్పందన కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదు మేరకు తాము పరిశీలించి ఆసుపత్రిని సీజ్ చేశామన్నారు. ఆసుపత్రి నిర్వాహకులు పూర్తి అనుమతులు తీసుకున్న తరువాత ఆసుపత్రిని మరలా నిర్వహించుకోవచ్చునని స్పష్టం చేశారు. అయితే తమ దరఖాస్తు తిరస్కరణకు గురైన తరువాత జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో సంబంధిత అధికారులు సెలవులో ఉండడంతో తాము ముందుకు వెళ్లలేకపోయామని, మాకు సమయం ఇస్తే అన్ని అనుమతులు తీసుకుంటామని ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ శ్రమంత్ కుమార్‌రెడ్డి అధికారులను కోరారు. కాగా కేవలం అగ్నిమాపక శాఖ అనుమతులు లేని కారణంగా అశ్విని ఆసుపత్రిని సీజ్ చేయడం తగదంటూ వైసీపీ విద్యార్థి విభాగం, ఎస్ఎస్‌యూఐ నాయకులు వైద్య ఆరోగ్య శాఖాధికారులు ముందు ఆందోళన చేపట్టారు. వైద్య సదుపాయాల పరంగా ఎటువంటి ఫిర్యాదులు లేకపోయినా, ఆసుపత్రి నిర్వాహకులకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా సీజ్ చేయడం ఏమిటని వారు ప్రశ్నించారు. ఇటీవల బాలిక కాన్పు వ్యవహారం జరిగిన మాధవి ఆసుపత్రిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, తొలుత ఆ ఆసుపత్రిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

మాధవి ఆసుపత్రిలో రికార్డుల పరిశీలన

మల్లెల గ్రౌండ్స్‌లోని మాధవి ఆసుపత్రిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి లక్ష్మీనరసయ్య, డెమో అధికారిణి దేవశిరోమణి, ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రసాద్ నాయక్ బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఆసుపత్రి నిర్వాహకురాలైన డాక్టర్ మాధవి ప్రస్తుతం అందుబాటులో లేరని, అయితే ఆసుపత్రిలో రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయని పరిశీలన అనంతరం అధికారులు వివరించారు.

బాలసదనాల్లో ఉద్యోగావకాశాలు

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనాల్లో వివిధ ఉద్యోగాలకు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసేందుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టుల వివరాలు, అర్హత, నిర్ణయ ప్రమాణాలు, దరఖాస్తు ఫారాలను https://kadapa.ap.gov.in సైట్ నుంచి పొందాలని తెలిపారు. అర్హతలున్న అభ్యర్థులు పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత ధృవీకరణ పత్రాలు జతపరిచి ఈ నెల 27న సాయంత్రం 5గంటల్లోపు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ, సాధికారత అధి కారి కార్యాయం డీబ్లాక్, కొత్త కలెక్టరేట్, కడపలో సమర్పించాలన్నారు. అర్హత ప్రమాణాలను అనుసరించి కుదించబడిన జాబితాలోని అభ్యర్థులును మాత్రమే ఇంటర్వ్యూలకు పిలవనున్నట్లు తెలిపారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న బాలల పరిరక్షణ విభాగం, ప్రత్యేక దత్తత సంస్థ (శిశు గృహ)లో ఖాళీగా ఉన్న పలు పోస్టులకు కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 27న తమ కార్యాలయానికి అందించాలని పి.రమాదేవి వివరించారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న ఐసీడీఎస్‌పీడీ రమాదేవి

కడప ఎన్టీఆర్ సర్కిల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ పీడీ రమాదేవి అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయిలో పోషణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వాటర్, శానిటేషన్, హైజీన్ పైన అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, సీడీపీఓలతో అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై ఎక్కువ శ్రద్ధ వహించాలన్నారు. కమ్యూనిటీలో అందరికీ వివిధ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి అందరూ వాష్‌ని సక్రమంగా పాటించేలా చేయాలన్నారు. చేతుల పరిశుభ్రతలో భాగంగా 7 స్టెప్స్ ద్వారా చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలి, భోజనానికి ముందు తరువాత, మల విసర్జన తరువాత చేతులు శుభ్రపరచుకోవడం చాలా అవసరమన్నారు. కార్యక్రమంలో 13 ప్రాజెక్టుల సీడీపీఓ, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.